Entered

ఆదివారం

ప్రజాశక్తి

ఫిబ్రవరి 20, 2005




వాహ్... సానియా

హ్యాపీ బర్త్‌డే

(20-2-2005నుంచి26-2-2005వరకు)

పూజా మాధురి
2సం॥, 20.2.2003
పుష్పవేణి-సత్యనారాయణమూర్తి
రాచపాలెం-తూ॥గో॥

వెంకటేష్
4సం॥, 20.2.2001
విజయలక్ష్మి-శ్రీనివాస్
పొందూరు-శ్రీకాకుళం

నెహ
2సం॥, 20.2.2003
రేఖ-లక్ష్మారెడ్డి
మోస్రా-నిజామాబాద్

సూర్యప్రకాశ్
3సం॥, 20.2.2002
స్వరూపరాణి-వెంకటేశ్వర్లు
ఖమ్మం

కె. నిహారిక
ఫిబ్రవరి-21
భువనేశ్వరి-మురళీధర్
కొత్తకోట-చిత్తూరు

శర్మ
1సం॥, 21.2.2004
సీతామహాలక్ష్మి-సుబ్రమణ్యం
రామచంద్రాపురం-తూ॥గో॥

రెడ్డిరోహిత్-లలస
2సం॥, 21.2.2003
గాయిత్రి-చంద్రశేఖర్‌రెడ్డి
చిత్తూరు

రామకృష్ణ
9సం॥, 21.2.1996
మంగ-శ్రీనివాస్
సామర్లకోట-తూ॥గో॥

కీర్తి
3సం॥, 22.2.2002
దుర్గాభవాని-దుర్గారావు
తాడేపల్లి-గుంటూరు

తేజశ్రీ
ఫిబ్రవరి-22
భారతి-చంద్రమౌళి
కుంట్రపాకం-తిరుపతి

రోహన్-రోషన్
2సం॥, 22.2.2003
రజిత-మోహన్
వైరా-ఖమ్మం

శిరీష
పద్మ-సైదయ్యచారి
పానుగోడు-నల్లగొండ

అనూష
9సం॥, 24.2.1996
శైలజ-రామసుబ్బారెడ్డి
తర్నాక-హైదరాబాద్

చంద్రప్రకాష్‌రెడ్డి
4సం॥, 24.2.2001
హరిత-రవిందర్‌రెడ్డి
అమరచింత-మ॥నగర్

శ్రీధరజ్
7సం॥, 24.2.1998
శ్రీదేవి-శ్రీకాంత్
పోరంకి-విజయవాడ

రోహన్
1సం॥, 24.2.2004
రేఖ-శ్రీనివాసచారి
బిహెచ్ఇఎల్ టౌన్ షిప్ -హైదరాబాద్

సాయికృష్ణ తేజ యాదవ్
5సం॥, 25.2.2000
కృష్ణవేణి-చెన్నయ్య
బుద్దాయిపాలెం-కడప

సనాబేగం
1సం॥, 25.2.2004
జహెదబేగం-మహిముద్
అమరచింత-మ॥నగర్

ప్రవీణ
2సం॥, ఫిబ్రవరి-2003
రాజు-రామకృష్ణ
సీతారామునిపేట-విజయనగరం

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం

ఎందుకిలా...భూమీ?!

ఫిబ్రవరి 6వ తేదీ ఆదివారం అనుబంధం కవర్‌స్టోరీ "భూమీ...భూమీ... ఎందుకిలా...?!" చాలా విజ్ఞానదాయకంగా ఉంది. ఈ విశ్వం పదార్థమయం, నిరంతర చలనం అనే విషయాన్ని చక్కగా బోధించారు. దాని చలనంలోని అనేక అంతుపట్టని విషయాల్ని అందరికీ అర్థమయ్యేలా చెప్పారు. డిసెంబర్ 26నాటి భయంకర సునామీ ఉపద్రవాన్ని జంతువులు ముందే గ్రహించాయని ఆసక్తికర అంశాన్ని వివరించారు. థాయ్‌లాండ్‌లోని జంతు ప్రదర్శనాశాలలో ఏనుగులు, వాటి మావటివారు ఎంత శాంతింపజేసినా ఘీంకరించడం, సునామీ ప్రమాదరాకకు ఓ గంట ముందే గొలుసులు తెంపుకుని ఎత్తైయిన ప్రాంతాలకు వెళ్ళిపోవటం వింతయిన విషయం. అది చదివి ఆశ్చర్యపోని పాఠకులుండరంటే అతిశయోక్తి కాబోదు.

-సిరిపురపు రామకోటేశ్వరరావు,
ఎనికేపాడు, కృష్ణాజిల్లా

సునామీ అనంతరం

ఈ వారం కవర్‌స్టోరీ ద్వారా సునామీ విలయం తరువాత భూమి గమనంలో, వాతావరణంలో వచ్చిన మార్పులు గురించి బాక్సులుగా పెట్టి చక్కగా వివరించారు. సునామీ ఎలా వస్తుంది, దానిని ముందుగానే గమనించే మార్గాలు, పద్ధతుల గురించి బొమ్మలతో వివరించిన విధానం బాగుంది. చాలా చక్కగా అర్థం చేసుకోగలిగాం. సునామీని జంతువులు ఎలా గుర్తిస్తాయో పాఠకులకు చాలాబాగా వివరించారు. కంచిస్వామి అరెస్టు వల్లే పాపాలు పెయ్యలేక ఈ సునామీ వచ్చిందనే మూఢనమ్మకాలతో చేసే ప్రచారాల ముఖంమ్మీద గుద్దినట్లు చెప్పినట్లుంది. అలాంటి నమ్మకాలబారిన పడ్డవాళ్ళకు కనువిప్పులాగా ఉంది. అంత వివరంగా రాసిన రచయతగారికి ధన్యవాదాలు.

-ఎం లలిత,
కంచరాం, శ్రీకాకుళం జిల్లా



మంచి టూరిస్ట్‌గైడ్

ఈ వారం సంచికలోని టూరిస్ట్‌గైడ్ అంశం బాగుంది. కొన్ని పత్రికలు ప్రఖ్యాతిగాంచిన ప్రదేశాలను మాత్రమే ఇస్తున్నాయి. వెలుగులోకి రాని మంచి ప్రదేశాలను వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేయడం మంచి ప్రయత్నం. అందులో భాగంగా గతవారం అనుబంధంలో గోదావరిజిల్లాల్లోని పేరుపాలెంబీచ్, జీలకర్రగూడెం గురించి ప్రచురించడం బాగుంది. అదేవిధంగా జీవనశైలి శీర్షికలో "యుగమింకా మారలేదు" అనే రచన మమ్మల్ని ఆకట్టుకుంది.

-పొట్లపల్లి మహేశ్‌బాబు,
ఎల్లూరు, మహబూబ్‌నగర్‌జిల్లా

ఈ వారం కవిత

కళాసాహితి శీర్షికలో ప్రచురించిన కవిత 'మనకొద్దురా బిడ్డా' కవిత మాకు నచ్చింది. బిడ్డ గురించి తల్లిపడే ఆరాటం ఆ కవితలో కనిపించింది. హింసాప్రవృత్తి మనకొద్దు, బతికుంటే బలుసాకు తినొచ్చని ఆమె పడే తాపత్రయం అర్థమవుతుంది. ఇలా కొత్తతరం కవులను ప్రోత్సహిస్తే మరిన్ని కవితలు స్పందన రూపంలో వెలుగులోకి వస్తాయి. కార్టూన్ కదంబంలో కార్టూన్స్ బాగున్నాయి.

-శైలజా సనత్, విశాఖపట్టణం

నెమలి కథ సూపర్

నెమలిని మన జాతీయ పక్షిగా జనవరి 31న నిర్ణయించిన దినం పురస్కరించుకుని 30వ తేదీ సంచిక కవర్‌స్టోరీగా ప్రచురించిన కథనం సందర్భోచితంగా ఉంది. ఆసక్తిగా చదివించి ఎన్నో విషయాలను తెలియజేసింది. జాతీయచిహ్నాంగా ఎన్నుకోవడం వెనుక దాగిన విషయాలు, మన జాతీయచిహ్నాలతో పాటు వివిధ దేశాల జాతీయవృక్షాలు గురించి సంపూర్ణంగా తెలుసుకున్నాం.

-శివాల శ్రీనివాసరావు,
విద్యానగర్, ఆముదాలవలస

సత్యమే పలకాలి కదా....!

వయసుకి చిన్నయినా ఆయనే మాకు పెద్దాయన !

ఆ పెద్దాయనే మాకు మారాజు.

ఆ మాటకొస్తే మనందరికీ ఆయనే మరి !

ప్రజాభిప్రాయం కూడా అదేనని స్టాంపు గుద్దుకున్నాక కాదంటే ఒప్పుతుందా చెప్పండి.

అంచేత ఎవరికిష్టం ఉన్నా లేకున్నా మా పెద్దాయనగారు ఈ స్టేటుకే మారాజు !

ఎల్లప్పుడూ సత్యమే, అన్నీ నిజాలే ప్రజలం...ద్దరి చేత పలికించాలని ఆయనకు మా గొప్ప ఇదండి !

మన జాతీయచిహ్నం కిందున్న 'సత్యమేవ జయతే' సూక్తిని పదేపదే వల్లించడమంటే మారాజుకెంతిష్టమో చెప్పలేం!

తాను వల్లించడమే చేసినా...తన ప్రజలు మాత్రం పాటించితీరాలని ఎంత ఉబలాటమో కూడా చెప్పలేం !

నిజాలు మాత్రమే మాట్లాడుకోవాలని చట్టాలు చేద్దామనుకున్నారు గానీ...'చట్టాల భాగవతం' ఎంత రసవత్తరమో తనకంటే ప్రజలకే బాగా తెలుసు కదా అని విరమించుకున్నాడు.

అందరిచేతా నిజాలే కక్కించేందుకు అధునాతన లై డిటెక్టరు మిషన్లు పెడదామంటే...మా మారాజుగారి "నెత్తిమీది ఏలిక" అంత ఖర్చుకి అనుమతిస్తారో లేదోనని సంశయించారు.

ఈ మధ్యనే పెద్దాయన నగరసంచారం చేస్తే తన ఆరోగ్యానికి మంచిదనిపించి మొదలెట్టారు కదా!

వీరికి ఆహ్వానం పలికే మైకులోంచి...

"అప్పనాతనామనా అందరికి దండాలన్నా...తాగినోడి నోట నిజం తన్నుకుంటూ వస్తాదన్నా..." పాట మారాజుగారి చెవిన పడింది.

ఓ భేషైన ముదనష్టపుటాలోచన మదిలో మెదలడమూ, సదరు నగరసంచారానంతర సభయందు ప్రకటించడమూ అయిపోయిందండి !

అంతే...

పల్లె పల్లెకూ బారులే బార్‌లు...

బారబారకో బార్ !

ఈ సంచికలో . . .

ఓరా! ... 3
కార్టూన్ కదంబం... ... 4
కవర్ స్టోరీ ... 5
జీవనశైలి ... 10
బాలల కథ ... 11
బాలనేస్తాలు ... 12
ఇంతి సంగతి ... 16
కచేరి ... 17
ఆరోగ్యం ... 18
పుస్తక పరిచయం ... 20
న్యాయసలహాలు ... 24

ఇంకా...

'అవ్వోయ్ బూసి'

కథ ... 8, 9

మహారాణి

రియల్ స్టోరీ ... 14, 15

తారామతి బారాదరి



టూరిస్ట్‌గైడ్ . . . 21

కళాసాహితి . . . 22, 23

గోద్రా గోరీ చూతమురండీ !

ఇంకొద్దిరోజుల తరువాత గుజరాత్‌కి ఎవరన్నా యాత్రికులుగా వెళితే...ఇదే సీను మరి! గోద్రా దురంతాలు, ఘోరాలు ఎన్నో జరిగినమాట నిక్కచ్చిగా నిజమే. కానీ...ఆ నిజాలన్నీ సరిగా చేయని పోస్టుమార్టమ్ శవపుగోతాంలో కుక్కి పాతరేసిన నిలువుసమాధి దివ్యంగా వెలిసింది. గోద్రా స్టేషన్‌కి కొద్ది దూరంలో ఆపిన సబర్మతి ఎక్స్‌ప్రెస్ ఎస్-6 బోగీ బుగ్గిపాలవ్వడం ముందస్తు కుట్ర అన్నారు. ఎవరిదా కుట్ర అన్న ప్రశ్న పీక నులిమి శవాలసంచిలో భద్రం చేశారు ! బయట నుంచి కాదు బోగీ లోపలినుంచే మంటబెట్టారన్నారు. కొరివిపెట్టిందెవరనే క్వశ్చన్‌మార్క్‌కి మరో గోతాం రెడీ అయ్యింది!! ఇక ఆ తరువాతి గుజరాత్ గొడవలన్నింటికీ ఒక గోతాం, బెస్ట్‌బేకరీ సాక్ష్యాలకు మరో ప్రత్యేక గోతాం...ఇలా గోతాలమీద గోతాలు నింపి, ఎంచక్కా సమాధిచేశారు. పిండప్రదానాలు, దినాలు, మాసికాలు, తద్దినాలు ఎందరు పెట్టినా, నిజాలన్నీ గోరీ గొయ్యిలో క్షేమం! అసలు నేరపరివారులు నిక్షేపం!!



'నో స్టాక్' బోర్డు కలలోకొచ్చేనులే !

రాసి అచ్చొత్తిన పుస్తకం వెంటనే అమ్ముడయిపోయి "కాపీలు లేవహోచ్" అనిపించుకోవచ్చు తెలుసా ! మన హిందీ సినిమాల్లో అప్పుడప్పుడూ కనిపించే ఓ చిన్నసైజు యాక్టరయిన మిలింద్ గునాజీ కి 'అదేపని యాత్రికా' అనే నిక్‌నేమ్ ఉంది. ఆయన చూసొచ్చిన ప్రాంతాలను మనకూ తన పుస్తకంలో చూపించాలని తెగ ముచ్చటపడిపోయాడు. అందుకో పుస్తకం రాసిపడేశాడు. "చందేరీ భత్కాంటీ" అనే ఆ ట్రావెలాగ్‌కి ముందుమాట ముంబయ్ టైగర్ బిరుదాంకితులు, శివసేన అధిపతులుంగారైన బాల్ థాకరే రాశారు. వారి పుత్రరత్నం ఉద్ధవ్ థాకరే ఫొటోలు తీశారు. ది బిగ్ బి(పెద్దన్నయ్య @ బారన్నయ్య) అమితాబ్‌బచ్చన్ ఆ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇంత సీన్ ఇచ్చాక ఇక ఆ పుస్తకం అమ్మకాలు హిట్ అవ్వకుండా ఉంటుందా!!!

వాలెంటైన్ స్వీట్



జపానీ హైటెక్ వంటమేస్త్రీలు ఇటీవలొక తియ్యటి ప్రయోగం చేసిపడేశారు. ప్రేమికుల రోజు ఫిబ్రవరి 14 కోసమని వారం ముందే వండివార్చేశారు. నోరూ-వాయీ, వీధీ-వాకిలీ, ఊరూ-వాడా, దేశమూ-దివాణం అంతటా తామొండిపడేసిన తీపి వంటకం వాసనతో ఘుమాయించేయాలని జపానన్నయ్యల ప్రయత్నం. 150 లీటర్ల చాక్లెట్ ద్రవాన్ని ఓ ఖరీదైన కారుమీద మూకుళ్ళకొద్దీ దిమ్మరించారు. ఆ చిక్కటి స్ట్రాబెర్రీ చాక్లెట్ రసం గడ్డకట్టకముందే దానిపై రంగురంగుల చాక్లెట్లు, కూకీస్, బ్రెడ్ ముక్కలు అతికించి ముస్తాబు కూడా చేశారు. ఇక ఆ మహాతీపి వంటకాన్ని వారంరోజులపాటు ఊరిస్తూ ప్రదర్శనకు పెట్టారు. చీమలు పట్టకుండా ఉంటే ఎంచక్కా తినుంటారు.

పరిటాల రవి హత్య
అసెంబ్లీ సమావేశాలు

కార్టూన్ కదంబం


దేశం పథకాలు
గవర్నర్
గవర్నర్ ప్రసంగం
మా పథకాలకే కొత్త పేర్లు —'దేశం'

ముషారఫ్
ప్రజాస్వామ్యం
నారు
టాప్ టెన్ నియంతల్లో ముషారఫ్ —అమెరికా వారపత్రిక



కళ్లు మిరుమిట్లు గొలిపే ఏస్‌లతో హడలెత్తించడం...
అందనంత వేగవంతమైన సర్వీసులతో దడ పుట్టించడం...
ప్రత్యర్థి పసిగట్టేలోపే తన ఎత్తుగడలు మార్చుకోవడం...
ఊహించలేని ప్లేసింగ్‌లతో ప్రత్యర్థిని బోల్తా కొట్టించడం...
బంతిపై ఏకాగ్రత నిలిపి ప్రత్యర్థి రాకెట్‌కు చిక్కకుండా కొట్టడం...
షాట్లలో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ ప్రత్యర్థిని డీలా పర్చడం...
బంతిని కోర్టు నలువైపులా కొడ్తూ ప్రత్యర్థిని పరిగెత్తించడం...
ప్రపంచ ఉత్తమ క్రీడాకారిణికి ఉండాల్సిన ఈ లక్షణాలన్నీ ఆమెలో దాగిఉన్నాయి.
ఆ యువ సంచలనమే సానియామీర్జా.

ఎం.డి. హాసన్ షరీఫ్

వాహ్... సానియా

పద్దెనిమిదేళ్ళ సానియా హైదరాబాద్ యువరాణిగా వెలుగొందింది. దేశవ్యాప్తంగా యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఈ టీనేజ్ టెన్నిస్ తార సంచలనాల మీద సంచలనాలు సృష్టిస్తూ హైదరాబాద్ ముద్దుబిడ్డగా వేనోళ్ల పొగడ్తలు అందుకుంటోంది. ఇటీవలే ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌శ్లామ్ టోర్నీలో సంచలనం సృష్టించి ప్రపంచదృష్టిని ఆకర్షించిన సానియా 15 రోజులు గడవకముందే మరో అంతర్జాతీయ టైటిల్ హస్తగతం చేసుకొని ప్రఖ్యాత క్రీడాకారిణిగా నిలిచింది.

నాలుగు వేల మంది పట్టే హైదరాబాద్‌లోని ఫతేమైదాన్ టెన్నిస్ కాంప్లెక్స్‌లో ఏడు వేలమందితో క్రిక్కిరిసిన స్టేడియం. సానియా మీర్జా కొట్టిన ఫోర్‌హ్యాండ్ షాట్‌కు బోండరెంకో సమాధానం ఇవ్వలేకపోయింది. దీంతో సానియాకు అంపైర్ పాయింట్ ఇచ్చాడు. వెంటనే సానియా మైదానాన్ని ముద్దుపెట్టుకుంది. స్టేడియమంతా చప్పట్లతో మార్మోగింది. కెమెరాలు క్లిక్‌మన్నాయి. ప్రేక్షకుల గ్యాలరీలో కూర్చున్న సానియా కుటుంబ సభ్యుల సంతోషానికి అవధులు లేకుండా పోయింది. మ్యాచ్‌ను టెలివిజన్‌లో తిలకిస్తున్న లక్షలాదిమంది నోటి నుండి ఒక్కసారే 'వాహ్! సానియా!!' అని వెలువడింది. వారి చేతుల్లోని భారత పతాకం గర్వంగా ఊగిసలాడింది. సానియా ఆనందంతో మైదానం నలువైపులా పరుగెత్తుతూ ప్రేక్షకులకు అభివాదం చేసింది. హైదరాబాద్‌లో 2005 ఫిబ్రవరి 12, శనివారం జరిగిన డబ్ల్యుటిఎ హైదరాబాద్ ఓపెన్ ఫైనల్ మ్యాచ్‌లో సానియా టైటిల్ సాధించిన క్షణంలో జరిగిన సంఘటన ఇది.

ఉక్రెయిన్‌కు చెందిన అలయోనా బోండరెంకోను ఫైనల్లో 6-4, 5-7, 6-3 తేడాతో ఓడించిన సానియా వరల్డ్ టెన్నిస్ అసోసియేషన్(డబ్ల్యుటిఎ) టైటిల్ సాధించిన తొలి భారతీయురాలిగా నిలిచింది. 18 ఏళ్ల టీనేజ్ స్టార్ సొంతగడ్డపై సంధించిన బలమైన సర్వీసులకు, ఏస్‌లకు, బ్యాక్‌హ్యాండ్ షాట్లకు అగ్రశ్రేణి క్రీడాకారిణుల వద్ద సమాధానం లభించలేదు. దీంతో 24 దేశాలకు చెందిన 42 మంది ప్రపంచ శ్రేణి క్రీడాకారిణులు పాల్గొన్న ఈ



రన్నర్ బోండరెంకో, విన్నర్ సానియామీర్జా

టెన్నిస్ చరిత్ర

ఈ టెన్నిస్ క్రీడకు మూలం ఏమిటి అనేదొక వివాదాంశంగా ఉంది. ఈజిప్షియన్లు, గ్రీకులు, రోమన్లు 'గ్రాండ్ పా ఆఫ్ టెన్నిస్" అనే పేరుతో ఈ ఆట ఆడారని కొందరు అంటున్నారు. ఇలా భావించడానికి కొన్ని ఆధారాలు కూడా కనబడుతున్నాయంటున్నారు. పురాతన ఈజిప్టు కాలానికి చెందిన కొన్ని అరబిక్ పదాల నుంచి ఈ టెన్నిస్ అనే పదం వచ్చిందంటున్నారు. ఈజిప్టులో నైలునది తీరాన ఉన్న టెన్నిస్ నగరం పేరునే ఈ ఆటకు పెట్టారు. మొదట్లో ఈ నైలునది ఒడ్డున అరచేతులతో బంతిలాంటి దాన్ని ఎదురెదురుగా నుంచొని ఆడారట. ఆ అరచేతిని అరబ్బీ భాషలో "రాహత్" అనే పదంనుంచి గ్రహించి "రాక్వెట్" (Racquet) పదం ఏర్పడినట్లు చెబుతున్నారు. అదే వాడుకలో "టెన్నిస్‌రాకెట్" గా ఆ క్రీడాకారుల చేతిలో ఆడుతోంది.

మరో కథనం కూడా ఉంది. ఈ క్రీడ ఫ్రెంచి దేశపు ఆవిష్కరణ అని అంటున్నారు. సుమారు 11వ, 12వ శతాబ్దంలో ఫ్రెంచ్ సన్యాసులు తమ ఆశ్రమాల గోడలకు బంతిని అరచేతితో కొడుతూ ఆడేవారు. కాలక్రమంలో ఒక నిర్ణీత కోర్టు మధ్యగా తాడును కట్టి దానికి ఇరువైపులా ఆటగాళ్ళు నిలబడి ఆడేవారు. ఫ్రెంచ్ పదమైన "టెనెజ్"(దీన్ని అందుకో) నుంచి 'టెన్నిస్' గా వచ్చిందనేది కూడా నమ్మశక్యంగా ఉంది. మొదట్లో చేతుల్తో మాత్రమే ఆడే ఈ ఆట బంతి గట్టిదనం వల్ల చేతులు వాచిపోయేవి. కార్క్‌వూలు బంతుల ధాటికి చేతుల బొబ్బలు తేలేవి. దానితో చేతులకు మందపాటి గ్లౌవ్‌లు తొడుక్కుని ఆడారు. కాలక్రమంలో తమ అరచేయి రూపంలో ఈనాడు మనం చూస్తున్న టెన్నిస్‌రాకెట్ ఏర్పడింది. బహిరంగ స్థలాలనుంచి ఇన్‌డోర్ స్టేడియం క్రీడగా నేడు మనముందుంది.

13వ శతాబ్దంలో ఫ్రెంచి రాజరికం రెండువేల టెన్నిస్ కోర్టులను ఏర్పరిచి ఈ టెన్నిస్‌క్రీడను వ్యాప్తిచేసింది. ఫ్రెంచి రాజులైన ఏడవ హెన్రీ, ఎనిమిదవ హెన్రీలు ఈ ఆటను బాగా ఆడేవారు. వారి పరిపాలనా కాలంలోనే ఫ్రాన్స్ నుంచి బ్రిటన్‌కు ఈ ఆట వ్యాపించింది. 1850లో చార్లెస్ గుడ్‌ఇయర్ టెన్నిస్‌బంతి తయారీలో మార్పులు తెచ్చాడు. 1874 వ సంవత్సరంలో మేజర్ వాల్టర్ సి వింగ్‌ఫీల్డ్ ఈ క్రీడకు ఆధునిక నిబంధనలు, పరికరాలు, బంతి రూపురేఖలు సమకూర్చాడు. వింగ్‌ఫీల్డ్ ఆధునిక టెన్నిస్ పితామహుడనే పేరుగాంచాడు. ఇప్పటికీ టెన్నిస్ కోర్టు నిర్మాణం, నెట్ లైన్స్, క్రీడ నియమనిబంధనలలో చాలావరకూ ఈ వింగ్‌ఫీల్డ్ పెట్టినవే. ఆ తరువాత మూడేళ్ళకే ఇంగ్లండు టెన్నిస్ ఆటలో ప్రపంచంలోకే అగ్రగామిగా నిలిచింది. ఆల్ ఇంగ్లాండ్ టెన్నిస్ క్లబ్ తన మొట్టమొదటి "వింబుల్డన్ టోర్నమెంట్" నిర్వహించింది.

("సిఫీ స్పోర్ట్స్" వారి వెబ్‌సైట్ వ్యాసం "ఆరిజన్ ఆఫ్ టెన్నిస్" ఆధారంగా -సండేడెస్క్)

టోర్నీలో టైటిల్ సానియా వశమైంది. ఎదుటి పక్షం పసిగట్టేలోపే ఎత్తుగడలను మార్చింది. వేగవంతమైన సర్వీసులతో అవతలి కోర్టులో ఉన్నవారి గుండెను దడదడలాడించింది. బంతిపై నుండి ఏకాగ్రతను కోల్పోకుండా వైవిధ్యభరిత షాట్లతో ప్రత్యర్థి ఆత్మస్థయిర్యాన్ని నీరుగార్చింది. తరుణి వయస్కురాలైన సానియా తన ప్రతిభతో గ్రాండ్‌శ్లామ్ టైటిల్ సాధించే సత్తా భారతీయులకు కూడా ఉందని నిరూపించింది.

మహిళా ఆధిపత్యం

పురుషులే ఆధిపత్యం వహించే టెన్నిస్‌లో మహిళలూ తీసిపోరని 70వ దశకంలో మార్టినా నవ్రతిలోవా, క్రిస్ ఎవర్ట్ నిరూపించారు. రెండు దశాబ్దాలకుపైగా మార్టినా, క్రిస్ ఎవర్ట్‌ల మధ్య పోరు హోరాహోరీగా సాగింది. 70, 80వ దశకాల్లో మహిళా టైటిల్ ఫైనల్ పోరు ఎక్కువగా వీరిద్దరి మధ్యే జరిగింది. అప్పటి నుండే టెన్నిస్‌లో పురుషుల ఆధిపత్యం తగ్గి గ్లామరస్ క్రీడగా రూపాంతరం చెందింది. సబాటినీ, మోనికా సెలెస్, మేరీ పియర్స్, మార్టినా హింగిస్, స్టెఫీ గ్రాఫ్, షరపోవా తదితర క్రీడాకారిణులు మహిళా వారసత్వాన్ని, టెన్నిస్ గ్లామర్‌ను ఇప్పటికీ కాపాడుతున్నారు. వీళ్లంతా అంతర్జాతీయంగా ప్రఖ్యాతిగాంచారు.

లియాండర్ పేస్, మహేశ్ భూపతి పురుషుల టెన్నిస్‌లో భారత్ ఖ్యాతిని ఖండాంతరాలకు విస్తరించారు. మహిళా విభాగంలో ఆ లోటును ఇప్పుడు సానియా మీర్జా తీరుస్తోంది. పన్నెండేళ్ల వయస్సులోనే అండర్-14, అండర్-16 విభాగాల్లో జాతీయ టైటిళ్లు సాధించిన సానియా మహిళా టెన్నిస్‌లో భారత్‌కు బంగారు భవిష్యత్తు ఉందని చాటి చెప్పింది. వయస్సుకు మించిన పరిణతి కనబర్చిన ఈ చిచ్చరపిడుగుకు జివికె కృష్ణారెడ్డి అండగా నిలిచారు.

కృష్ణారెడ్డి జివికె గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్‌కు అధిపతి. ఆయన ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. అండర్-14, 16 టైటిళ్లు సాధించిన తర్వాత సానియాతో కృష్ణారెడ్డి ఒకసారి టెన్నిస్ ఆడారు. సానియా ఆటతీరును చూసి అచ్చెరువొందిన కృష్ణారెడ్డి ఆమె ప్రాక్టీసుకు అయ్యే ఖర్చులన్నీ భరించడానికి అంగీకరించారు. దీంతో సానియా ఎలాంటి బెంగ లేకుండా ప్రాక్టీసును కొనసాగించి ఈ స్థాయికి చేరుకుంది. సానియా ప్రాక్టీసుకు లక్షలాది రూపాయలు ఖర్చుచేయలేక ఇబ్బందులు పడిన సానియా తండ్రి ఇమ్రాన్ మీర్జా, జివికె అండతో ఊపిరి పీల్చుకున్నాడు. జివికె అందించిన సహకారంతో అంచెలంచెలుగా ఎదిగిన సానియా ఇప్పటివరకు కెరీర్‌లో 16 ఐటిఎఫ్ టైటిళ్లు సొంతం చేసుకుంది. దేశంలో తిరుగులేని క్రీడాకారిణిగా వెలుగొందిన సానియాను 2003వ సంవత్సరం అంతర్జాతీయ స్టార్ క్రీడాకారిణిగా నిలిపింది. ఆ ఏడాది వింబుల్డన్ జూనియర్ డబుల్స్ టైటిల్ సాధించి దేశ ఖ్యాతిని ఖండాంతరాల్లో వ్యాపింపజేసిన సానియా ఆఫ్రో-ఆసియన్ గేమ్స్‌లో స్వర్ణ పతకం, బుసాన్ ఆసియాడ్ మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్య పతకం కూడా సాధించింది. ఈ ఏడాది ఆమె ఎవరికీ అందనంత ఎత్తుకు ఎదిగింది. రెండేళ్ల క్రితం ప్రొఫెషనల్ క్రీడాకారిణిగా మారిన సానియా సీనియర్స్ విభాగంలో ఆడిన తొలి గ్రాండ్‌శ్లామ్ టోర్నీలోనే సంచలనం సృష్టించింది. మెల్బోర్న్‌లో జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీలో మూడో రౌండ్‌కు చేరుకొని గ్రాండ్‌శ్లామ్‌లో ఆ స్థాయికి చేరిన తొలి భారత క్రీడాకారిణిగా నిలిచింది. ప్రపంచ మాజీ నెంబర్ వన్ సెరీనా విలియమ్స్‌ను ఓడించడంతో సానియా ఖ్యాతి ఖండాంతరాల్లోకి చేరుకుంది. అదే ఉత్సాహంలో ఉన్న సానియా వెంటనే జరిగిన హైదరాబాద్ ఓపెన్‌లో విజయదుంధుభి మోగించి వంద కోట్ల భారత ప్రజల నీరాజనాలు అందుకుంది. ఫోర్‌హ్యాండ్, బ్యాక్‌గ్రౌండ్ స్ట్రోక్స్ కొట్టడంలో దిట్ట అయిన సానియా 95 ఎలో పాయింట్లు సొంతం చేసుకుంది. దీంతో ఆమె ర్యాంకు 131 నుండి 99కు ఎగబాకింది. అంతేకాదు ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌శ్లామ్ టోర్నీలో నేరుగా అర్హత సాధించింది. సానియా తదుపరి లక్ష్యాన్ని 25లోపు ర్యాంకు సాధించాలని నిర్దేశించుకుంది. ముస్లిం సంప్రదాయంలో ఉన్న కట్టుబాట్లను తెంచుకొని అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి ఆర్జించం సానియాకే చెల్లింది. తన తల్లిదండ్రులు

నవ్రతిలోవా

అందించిన సహకారం, ప్రోత్సాహం వల్లే తానీ స్థాయికి చేరుకున్నానని తెలపడం ఆమె వినయానికి నిదర్శనం. "సానియా గ్రాండ్‌శ్లామ్ స్థాయికి చేరుకోవాలంటే సర్వీస్ విధానాన్ని మార్చుకోవాలి. చిన్న చిన్న మార్పులు, నిర్దిష్టమైన కృషితో దాన్ని సవరించుకోవడం సాధ్యమే" అని విజయ్ అమృతరాజ్ అన్నారు. "స్థిర చిత్తంతో, శారీరక సామర్థ్యాన్ని సుదీర్ఘ కాలం ప్రదర్శించగలిగిన వాళ్లు అజేయులవుతారు" అని నిరూపమ వైద్యనాథన్ అన్నారు. ఈ లక్షణాలు సానియాలో మెండుగా ఉన్నాయి. సౌరవ్



షరపోవా

గంగూలీ కోల్‌కతా ప్రిన్స్ అయితే సానియా హైదరాబాద్ ప్రిన్సెస్ (యువరాణి) అనడంలో తప్పులేదు.

సానియాపై కానుకల వర్షం

డబ్ల్యుటిఎ టైటిల్ సాధించిన సానియా ట్రోఫీతో పాటు 22 వేల అమెరికా డాలర్ల ప్రైజ్ మనీ (11 లక్షల రూపాయులు) సొంతం చేసుకుంది. సింగిల్స్ తొలి రౌండ్‌లో గెలిచినందుకు వెయ్యి డాలర్లు, రెండోరౌండ్‌లో విజయం సాధించినందుకు 1,825 డాలరు కూడా ఆమె ఖాతాలో జమ అయ్యాయి. క్వార్టర్ ఫైనల్స్ గట్టెక్కినందుకు 3,400 డాలర్లు, సెమీస్‌లో నెగ్గినందుకు 6,300 డాలర్లు, ఫైనలిస్టుగా 12 వేల డాలర్లు కూడా ఆమె సొంతం చేసుకుంది. డబుల్స్ తొలి రౌండ్‌లో గెలిచినందుకు 550 డాలర్లు కూడా లభించాయి. ఇవే కాకుండా వాణిజ్య ప్రకటనల ద్వారా కోట్లాది రూపాయులు ఆమె దరి చేరనున్నాయి. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మూడోరౌండ్‌కు చేరుకోగానే ప్రపంచఖ్యాతిగాంచిన 15 సంస్థలు ఆమె యాడ్‌ల కోసం పోటీపడ్డాయి. ఇప్పుడు డబ్ల్యుటిఎ టైటిల్ సాధించగానే కాస్మోటిక్స్, సెల్యూలార్ తదితర అంతర్జాతీయ సంస్థలు సానియా ఇంటిముందు క్యూ కట్టాయి. సానియాపై కోట్లాది రూపాయులు గుమ్మరించి ఆమె ఇమేజ్‌ను తమ వ్యాపారాభివృద్ధికి వినియోగించుకోవాలని



ఉవ్విళ్లూరుతున్నాయి.

గ్రాండ్‌శ్లామ్ కల నెరవేరాలంటే...

ట్రోఫీ గెలుచుకుంటే లేదా మరే ఘనకార్యమైనా సాధిస్తే పొంగిపోయి అవార్డులు, రివార్డులు ప్రకటించడంతోనే సరిపెట్టుకోకుండా ఇప్పుడిప్పుడే ఆదరణ పెంచుకుంటున్న టెన్నిస్‌లో మరింతమంది ప్రతిభగల క్రీడాకారులు, క్రీడాకారిణులు తయారయ్యేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం చేపట్టాలి. అంతర్జాతీయ పోటీలను నిర్వహించడం ద్వారా ప్రజల్లో ఆదరణ పెంచడం ఒక ఎత్తయితే, ప్రతిభ గల చిన్నారి టెన్నిస్ క్రీడాకారిణులను వెతికి ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాలి. దీనికోసం ప్రభుత్వ ఆధ్వర్యంలో అకాడమీని నెలకొల్పి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణ ఇవ్వాలి. అప్పుడే ఈ క్రీడ కూడా క్రికెట్ మాదిరిగానే ధనవంతులకే పరిమితం కాకుండా ప్రతిభావంతులందరికీ అందుబాటులోకి వస్తుంది. భారీ ఖర్చుతో కూడిన టెన్నిస్ శిక్షణను సొంత ఖర్చుతో తీసుకోవడం మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలకు సాధ్యం కాదు. ప్రయివేటు అకాడమిలను ప్రోత్సహిస్తే వాళ్లు ఆటగాళ్ల ప్రతిభ కంటే డబ్బుకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. దీంతో గ్రాండ్‌శ్లామ్ టైటిల్ సాధించాలనే భారత్ కల కల్లగానే మిగిలిపోతుంది. ప్రభుత్వం నిధుల కోసం అవసరమైతే ప్రయివేటు సంస్థల నుండి స్పాన్సర్‌షిప్, విరాళాల రూపంలో వసూలు చేసుకోవచ్చు. కానీ అకాడమీ నిర్వహణ మాత్రం ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఉండాలి. అప్పుడే నిజమైన క్రీడాకారులను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చేందుకు అవకాశం ఏర్పడుతుంది. తద్వారా గ్రాండ్‌శ్లామ్ కలలను నిజరూపంలోకి మార్చుకోవచ్చు. ✣

"అండర్ ట్వంటీఫైవ్ ర్యాంక్ సాధించాలి"

సానియా మీర్జాతో ప్రజాశక్తి ప్రతినిధి ఇంటర్వ్యూ

హైదరాబాద్ ఓపెన్ టైటిల్ సాధించినందుకు ప్రజాశక్తి తరుఫున కంగ్రాట్స్. మీ తదుపరి లక్ష్యమేంటి?

థాంక్స్. నా కాలి మడమ గాయం నుండి కోలుకోవడానికి కొద్దిరోజులు విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నాను. నా ఫిజికల్‌ఫిట్‌నెస్‌పైనే ఎక్కువ దృష్టి పెట్టాలనుకున్నాను. అందుకే సోమవారం నుండి ప్రారంభమయ్యే ఖతార్ ఓపెన్ టోర్నీకి వెళ్లడం లేదు. 28వ తేదీ నుండి ప్రారంభమయ్యే దుబాయ్ ఓపెన్‌లో పాల్గొంటాను.

మీరు ఎవరి వద్ద శిక్షణ తీసుకుంటున్నారు?

ఇటలీకి చెందిన బాబ్ బ్రాట్ వద్ద శిక్షణ తీసుకుంటున్నాను. మహేశ్ భూపతి బెంగుళూర్‌లో నిర్వహిస్తున్న టెన్నిస్ అకాడమీలో కూడా కోచింగ్ తీసుకుంటున్నాను. హైదరాబాద్‌లో నేను సొంతంగానే ప్రాక్టీసు చేస్తున్నాను.

మీ చదువుకు ఎలాంటి ఆటంకం కలగడం లేదా?

ఎక్కువసేపు మైదానంలో ఉండటం వల్ల చదువులో వెనకబడుతున్న మాట వాస్తవమే. పరీక్షల ముందు రెండు నెలలు టెన్నిస్‌ను తగ్గించి చదువుకు ప్రాధాన్యత ఇస్తాను. దీంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించగలుగుతున్నాను. 12వ తరగతి వరకు నాసిర్ స్కూల్ వాళ్లు మంచి సహకారం అందించారు. డిగ్రీ సెయింట్ మేరీస్ కాలేజీలో చదువుతున్నాను. పంజగుట్టాలోని కాలేజీ యాజమాన్యం చదువులో ప్రత్యేక క్లాసులు పెట్టి మంచి సహకారం అందిస్తున్నారు.

ముస్లిం మహిళగా ఛాందసుల నుండి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా?

మత ఛాందసులు విధించే ఘోషా, పర్దాలను నేను వ్యతిరేకిస్తాను. మా కుటుంబ సభ్యుల నుండి కూడా ఈ విషయంలో సహకారం లభిస్తోంది. ఛాందసులు ఎప్పుడూ ఏదో ఒకటి చెప్పి మహిళలను అణగదొక్కాలనే చూస్తారు. వాళ్ల మాటలు వింటూ కూర్చుంటే నేను ఈ స్థాయికి వచ్చేదాన్నే కాదు. ఇప్పుడు మీతో ఇలా కూర్చొని ఇంటర్వ్యూ ఇచ్చే స్వేచ్ఛ కూడా లభించేది కాదు. బుర్ఖా వేసుకుని టెన్నిస్ ఆడలేం కదా. సక్సెస్ సాధిస్తూ ఉంటే ఎవరి నుండీ అభ్యంతరం అంతగా ఉండదు.

టెన్నిస్‌లోకి ఎలా ప్రవేశించారు?

మా నాన్న క్రికెట్ ఆటగాడు. చిన్నప్పుడు నేను స్విమ్మింగ్ చేసేదాన్ని. టెన్నిస్ రాకెట్ పట్టడం మా నాన్నే నేర్పించాడు. నేను చదివిన నాసిర్ స్కూల్లో కూడా టెన్నిస్‌కు మంచి ప్రోత్సాహం ఉండటంతో అందులో ప్రావీణ్యత సంపాదించాను. నా తొలి గురువు....

టెన్నిస్ తరువాత మీరిష్టపడే క్రీడలు

స్విమ్మింగ్. టెన్నిస్ నేర్చుకోకుంటే నేను స్విమ్మర్ అయ్యేదాన్ని. క్రికెట్ అంటే కూడా చాలా ఇష్టం. అయితే ఆ బ్యాట్ చాలా బరువుగా ఉండటంతో క్రికెట్ ఆడాలంటే భయం. మ్యాచ్‌లను టెలివిజన్‌లో చూస్తాను. సచిన్ టెండూల్కర్ ఆట చూడాలంటే ఇష్టం. టెన్నిస్‌లో స్టెఫీగ్రాఫ్, ఆండ్రీ అగస్సీ ఆరాధ్యులు.

టెన్నిస్ జీవితంలో టర్నింగ్ పాయింట్ ఏంటి?

నేను పన్నెండేళ్ల వయస్సులో అండర్-14, అండర్-16 జాతీయ టెన్నిస్ టైటిళ్లు సాధించాను. అదే నా క్రీడా జీవితాన్ని మలుపు తిప్పింది. నాకు తొలి మేజర్ టైటిల్ కూడా అదే. ఆ టైటిల్‌ను జీవితంలో మర్చిపోలేను.

టెన్నిస్‌లో ఇబ్బందులు ఎదురైన క్షణాలు...?

చిన్నప్పుడు ఓటమి ఎదురైతే బాధపడేదాన్ని. నాన్న వేలాది రూపాయులు ఖర్చు చేసి శిక్షణ ఇప్పిస్తూ ఉంటే ఆయన కోరిక నెరవేర్చలేకపోతున్నానా... అనుకునేదాన్ని. రోజుకు ఏడెనిమిది గంటలు కోచింగ్ తీసుకుంటూ నా జీవితాన్ని వృధా చేసుకుంటున్నానా... అని బాధపడేదాన్ని. అయితే బాధపడ్తూ ఉంటే లాభం లేదు. కష్టపడటమొక్కటే పరిష్కారం అని మరింత పట్టుదలతో విజయం కోసం తపించేదాన్ని.

మీ లక్ష్యమేంటి?

వందలోపు ర్యాంకు సాధించాలన్న నా కల నెరవేరింది. (సానియాకు ఇప్పుడు 99వ ర్యాంకు). ఇక 25లోపు ర్యాంకు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాను.

'అవ్వోయ్ బూసి'

పి. జ్యోతి

పొదవాటి కరెంటు స్థంభంపైన తెల్లగా ట్యూబ్‌లైట్ వెలుతురు వెన్నెల వెలుగులా అక్కడి ప్రాంతం అంతా వ్యాపించి ఉంది.

అక్కడ ఆ గ్రామం పిల్లలంతా గుమిగూడి, జట్లు జట్లుగా ఆటలాడుతున్నారు. వీళ్ళ ఆటపాటలను దూరం నుండే గమనిస్తున్నాడు రాజేష్.

అసలు ఈ కుగ్రామానికి. కొద్దిరోజులక్రితం వరకూ కరెంటు కూడా లేదు. చీకటి పడితే చాలు అన్ని గుడిసెల్లోనూ మినుకు, మినుకుమంటున్న "గుడ్డి వెలుతురు బుడ్డిదీపాలు".

ఎవరి గుడిసెల్లో వారు మాటా మంతీ లేకుండా, "గూట్లో దీపం. నోట్లో ముద్ద" అన్నట్టుగా ఉండేవారు. చిన్న పిల్లలయితే తల్లుల కొంగులు వదిలేవారు కాదు. ప్రతీ రాత్రీ అమావాస్యే. ఒక్క పున్నమి రోజే ఆ పిల్లల ముఖాల్లో కూడా కాస్త వెలుగు కనబడేది.

"స్లెమ్మ సెక్కా సారెడేసి మొగ్గా ఇంకా"... అంటూ తర్వాతేంటో గుర్తు చేసుకుంటూ అందరి వంకా చూసి సిగ్గుతో నవ్వసాగింది ఆరేళ్ళ సిన్ని. దాని నవ్వు చూడగానే రాజేష్‌కు కరెంటులేని రోజుల్లో అది ఎంత భయానికి గురయిందో, నిజం చెప్పాలంటే సిన్ని మూలంగానే తమ గ్రామానికి కరెంటు తొందరగా తెప్పించుకోవాలన్న ఆలోచన కలిగింది. లేదంటే తమ గ్రామం అంధకార బంధనంలో మగ్గుతూ ఉండేది. ఒక్కసారిగా రాజేష్ కొద్దిరోజుల క్రితం సిన్ని ఎంతటి భయానికిలోనయిందో దాన్ని (అమాయకం, అజ్ఞానం) అప్పటి సంఘటనలను గుర్తుచేసుకో సాగాడు.

* * *

"అవ్వా!బూసి, అవ్వోయ్! బూసి" సిన్ని భయంతో గడగడ వణుకుతూ తల్లి చీరచెంగుల్లో ముఖం దాచుకుని గట్టిగా పట్టుకుంది.

"యేహె! యేడుందె బూసి సూపవె, సూపునాకు? అంటూ కందిలి వెలుతురును కాస్త పెద్దగ చేసి ఎత్తి పట్టుకుని చుట్టూరా చూసింది సోమి

"అవ్వోయ్ నేను కండ్లు తెర్వను, నా పక్కంబటే ఉందే నువ్వే సూడు" అని గట్టిగా కళ్ళుమూసుకుని, తల్లిని వదలకుండానే అంది సిన్ని.

"ఓర్నీ, నీకు పిచ్చిగిట్లబట్టిందా, యీడ ఏండ్లేదె... జెర కండ్లుదెరిసి సూడవె" అంది సోమి కాస్త కోపంగా సిన్ని చెయ్యిపట్టి పక్కకు లాగుతూ.

'వో అవ్వో, నాకు సాన బయమైతందే, నన్నిడిసిపెట్టి పోకే" అంటూ తల్లిని ఇంకాస్త గట్టిగా పట్టుకుంది సిన్ని.

"మీ అయ్య ఇంక రాలేదే ఒకపాలి బయటికి పోయి సూత్త నన్నిడిసిపెట్టె" అంది సిన్నిని విడిపించుకుంటూ.

"ఊహుహుహూ" అంటూ ఏడుపు సాగించింది సిన్ని.

"ఏందే గిది గియ్యాల నన్ను గిట్ల బల్లి బట్టినట్టు బట్టి వదుల్తలెవ్వు, ఇంగ నేనేం జెయ్యను" అని సోమి ఇంక అక్కడే కింద కూలబడింది సిన్నితో సహా.

'గీపొల్లకు ఏదన్న బట్టిందా ఏంది, గియ్యాల్టికి నాలుగు దినాలంది గిట్లనే జేయబట్టె, రేప్పొద్దున ఫకీర్‌తాత కాడి కన్న తీస్కపోత ఏదన్న రాసి కడ్తడు. దెబ్బకు దయ్యం గియ్యం వొదుల్తది" అనుకుంది తనలో తనే.

ఆ గ్రామంలో ఎవరికి ఏది వచ్చినా,కాలు నొచ్చినా, చెయ్యి నొచ్చినా ప్రతీదానికీ ఫకీర్‌తాత దగ్గరికి వెళ్ళి చూపించు కుంటారు. అతను మంత్రించి ఏదో కాయితం ముక్కమీద రాసి మెళ్ళోనో చేతికో కట్టి పంపిస్తాడు. ఇతనుచాలా పెద్దవయసువాడు. అక్కడి ప్రజలకు ఇతను కట్టే దానిపై గొప్ప నమ్మకం కలిగి ఉండేవారు. తగ్గుడు, తగ్గకపోవుడు ముచ్చట తరువాత. కొంతమందికి అతనిపై నమ్మకానికో ఏమో తగ్గినట్లనిపించేది. అందుకే సోమి, సిన్నిని అతనివద్దకు తీసుకువెళ్ళాలని నిర్ణయించుకుంది.

ఇంతలో తడిక తలుపు తీసిన చప్పుడు వినబడింది. అదివిన్న సోమి "మీ అయ్య వచ్చిండు లే బిడ్డ నీకేం భయంలేదు" అంది సోమి సిన్నిని లేపుతూ, కానీ అది మంచి నిద్రలో ఉంది.

నర్సయ్య ఇంటిముందు గోలెంలోని నీళ్ళతో కాళ్ళూ చేతులూ కడుక్కుని తలకు కట్టుకున్న తువ్వాలుతీసి తడి కాళ్ళు చేతులూ తుడుచుకుని, లోపలికొచ్చి అన్నం తినడానికి కూర్చున్నాడు.

సోమి అతనికి అన్నం పళ్ళెం అందిస్తూ "సిన్ని, ఇయ్యాల్టికి నాలుగు దినాల సంది సీకటిపడ్తేసాలు బుక్కెడు బువ్వ కూడ తింటలేదు. భయంఅంది ఒనుకుతుంది. గాలిగిట్ల తగిలిందో ఏంటో రేప్పొద్దున ఫకీర్‌తాత కాడికి తీస్కపోదం నువ్వుకూడారా" అంది నర్సయ్యకు పళ్ళెంలో ఇంకాస్త అన్నం దాన్లోకి ఎల్లిపాయకారం వేస్తూ.

"యేహె! నాకేడ తీర్తదే... పొద్దుగాల సీకటిలోకే దొరబాబు పొలంకాడికి పోయి పొలాన్కి నీళ్ళు పెట్టాలెగదా, నువ్వే దాన్ని తోల్కబోయి సూపెట్టు" అన్నాడు నర్సయ్య, ఖాళీపళ్ళెంలో చెయ్యి మూతి కడుక్కుంటూ.

సిన్ని నిద్రలో కలవరిస్తోంది.

"గీడికి గింతగూడ నేను జెప్పేది పట్టదు"

"గీడు గా దొర పొలంకాడ గొడ్డుతీర్గపని సేసుడు, పొలం కాడికి తిర్గితిర్గి ఈడి కాళ్ళు, గాళ్ళు ఇంటికాడ, ఎంగిలి బోళ్ళు తోమి తోమి నా సేతులు అరిగిపోయినయి గానీ, గింతగూడ ఒచ్చిందిలేదు, సచ్చిందిలేదు. దొర మాత్రం తన ఇంటికి మంచిగ కరెంటు బెట్టిపిచ్చిండు, అర్ర అర్రకు బుగ్గలు ఎల్గుతున్నయి. మేం మాత్రం గిట్ల సీకట్లనే పడి ఉంటున్నం. ఏం జేసిందుని దొర, దొర అని పోవుడ్ నాకయితే తెల్వట్లేదు. గీనికెంత జెప్పిన సమజుకాదు". అనుకుంది సోమి తనలో తానే.

ఈ దొరబాబు అనే అతను, ఆ గ్రామంలోకి అన్ని విధాలా ఉన్నవాడు. ఇతని గురించి చెప్పడానికేముంది. "పేరు గొప్ప ఊరుదిబ్బ" అని, తను గొప్పగా బ్రతుకుదామన్న ఆలోచనే కానీ, గ్రామంలోని ప్రజలకు కనీస అవసరాలు కూడా చూడదు. ఎంతసేపూ, ఈ అమాయక ప్రజలతో తన పనులన్నీ చక్కగ చేయించుకుంటూ జబర్దస్తగ తిరుగుతూ ఉంటాడు.

సిన్ని మళ్ళీ నిద్రలో కలువరిస్తోంది.

"అవ్వా మళ్ళా ఒచ్చిందే రాయె" అంటూ ఒకటే కలవరింతలు. అది వింటూనే సోమి తొందరగా వెళ్ళి దాని పక్కనే కూర్చుని వెన్ను నిమరసాగింది.

"నేను పక్కంబటే ఉన్న బిడ్డ ఏం భయంలేదు. నీకెందుకు, పండుకో" అంటూ అక్కడే కూర్చుండి పోయింది.

తల్లి చేతి స్పర్శలోని హాయికి, నెమ్మదిగా కన్నుమలిగింది సిన్నికి, తెల్లవార్లు దానిపక్కనే కూర్చుని జోకొడుతూ, జాగారం చేసింది సోమి.

లాలిపొద్దు రేఖలు గుడిసె ముంగిట వాలగానే, సిన్నిని తీసుకుని బయలుదేరిందిసోమి. అలా కొద్దిదూరం వెళ్ళగానే రాజేష్‌కు ఎదురయ్యారు వీళ్ళు, వీరిని చూస్తూనే అతను

"ఏంది సోమక్కా పొద్దున్నే సిన్నిని తీసుకొని ఎటుపోతున్నవు? అంటూ ప్రశ్నించాడు.

"తమ్మీ! ఏం జెయ్యమంటవు గీ పిల్ల నాలుగు దినాల సంది సీకటి బడంగనే, బూసి, బూసి అని భయపడుతాంది గందుకె గా ఫకీర్‌తాత కాడికి తీస్కపోతాన్న" అంటూ బాధపడుతూ చీర కొంగుతో కళ్ళనీళ్ళొత్తుకుంది.

"అయ్యో ఎందుకంత పరేషాన్ అయితవక్కా, నువ్వు ఇయ్యాల్టికి సిన్నిని తీసుకొని ఇంటికి పో, నేను చీకటి పడంగనే వచ్చి చూస్త గదెందుకు భయపడుతుందో" అని ధైర్యం చెప్పాడు.

"ఏందో తమ్మి గీ పిల్లతోటి ఫికర్ అయితుంది. మరి నువ్వొచ్చి సూత్తవుగద" అంది సోమి మరింత బాధపడుతూ.

"అదేంది అక్క అట్లంటవు, నేనేదన్న అన్ననంటె మాట తప్పుతన చెప్పు, నా మాట ఇనిపో" అన్నాడు రాజేష్ సోమికి నమ్మకంకలిగిస్తూ. రాజేష్ మాటంటే అక్కడి ప్రజలకు నమ్మకం ఎక్కువ. అందుకే వెంటనే తిరిగి ఇంటికి వెళ్ళిపోయింది సోమి సిన్నిని తీసుకుని,

రాజేష్ అక్కడ పుట్టి పెరిగినవాడే అయినా దగ్గరలో ఉన్న టౌన్‌లో కొంతకాలం ఉండి, చదువుసంధ్యలు ఒంటబట్టించుకున్నాడు. తను నేర్చుకున్న అక్షరజ్ఞానాన్ని వృధాపోనివ్వకుండా అక్కడి చిన్నపిల్లలకు నేర్పించే ప్రయత్నం చేస్తూ, ఇంకా అక్కడి వారికి తెలియని విషయాలు కాస్త వారికి అర్థమయ్యే విధంగా వివరించి చెబుతూ ఉంటాడు.

అన్నట్టుగానే చీకటిపడుతూ ఉండగా రాజేష్ సోమివాళ్ళ గుడిసె వద్దకు చేరుకున్నాడు. ఆ రోజుకూడ రోజు మాదిరి సిన్ని భయంతో గడగడలాడసాగింది. రెండు కళ్ళూ మూసుకుని తన ప్రక్కనే ఏదో ఉంది అని చెబుతుందేకానీ కళ్ళు తెరవడం లేదు.

గుడిసెలకు కరెంటు స్థంభాలు వేయించి తీగలు లాగించి లైట్లు వెలిగేలా చేయించగలిగాడు. అక్కడి ప్రజలకు (లైట్లు) వెలుతురు తెప్పించిన ఘనత దక్కించుకున్నారు. వాళ్ళ జీవితాల్లో కూడా వెలుగు తెప్పించాలని రాజేష్ ప్రయత్నం.

"సిన్నీ, కళ్ళు తెరువు నీకే భయంలేదు నేను ఇక్కడ ఉన్నాగద" అంటూ దాన్ని దగ్గరికి తీసుకుని బుజ్జగించాడు రాజేష్.

దానిని ఎన్నో విధాలుగా బ్రతిమాలగా నెమ్మదిగా కళ్ళుతెరిచింది.

"ఏదీ నిన్ను భయపెడుతున్నా బూచి చూపించు" అన్నాడు రాజేష్.

''మావా ఇదిగో'' అంటూ దాని చేయిచాచి ప్రక్కనే ఉన్న తన 'నీడ'నే చూపించింది.

"నా తీర్గనే ఉంది గిది, నా లెక్కనే రెండు జెడలేసుకుంది. సూడు, నువ్వుగూడ" అంటూ ఇంకా ఏదో చెబుతూ మళ్ళీ భయంతో కండ్లు మూసుకుంది. అది చూపించిన నీడను చూసాడు రాజేష్ . అది గుడిసె పై దాకా పాకి పొడవుగా నల్లగా కనబడింది.

అతనికి అప్పుడు అర్థమయింది దాని నీడను చూసి అది భయపడుతుందని.

సిన్ని అమాయకపు భయానికి విరగబడినవ్వాల్నో, ఇంకా కరెంటుకూడా లేకుండా వెర్రిబ్రతుకులు బ్రతుకుతున్నామేందోనని తమపై తామే జాలిపడాల్నో తెలియలేదు. మనుషులకు "అంధకారం అజ్ఞానాన్ని తెప్పిస్తుందో, అజ్ఞానం అంధకారాన్ని తెప్పించిందో'' తెలియట్లేదు. ఇక్కడి పరిస్థితి చూస్తుంటే. ఇంక ఎంత కష్టమైనా ఈ గుడిసెలకు కరెంటు తెప్పించాలి. తాను ఎన్నో సార్లు దొరబాబుతో చెప్పాడుకాని , అతను ఏ మాత్రం పట్టించుకోట్లేదని తెలిసింది. ఇక ఎవ్వరో వస్తారని ఎదురు చూడటం అవసరంలేదు అనుకున్నాడు. ఎవ్వరికైనా సరే "ఉన్నొన్ని జూస్తె పెట్ట బుద్ధయితది, లేనోన్ని జూస్తె మొట్టబుద్ధయితది", మా పని గూడ గట్లనె వుంది అనిపించింది అతనికి.

"ఏంది తమ్మి గట్లనే జూస్తున్నవు, పిల్లకు ఏమయిందంటవు" అంది సోమి రాజేష్ ఏమీ మాట్లాడకుండా నిలబడి ఉండటం చూసి.

"ఏంలేదు సోమక్కా సిన్నికి ఏంగాలె, ఇగొ గీనీడను జూసి భయపడతాంది గంతె. మనం జల్ది కరెంటు బెట్టిచ్చుకోవాలె గప్పుడు పిల్లగాండ్లందరు సంబరంగ ఆడుకుంటరు, ఇగ నేను గాపనిమీద ఉంటగాని, జెర గప్పడిదాంక పిల్లను జాగ్రత్తగ జూడు నేనింగపోతున్న" అని చెప్పి బయలుదేరాడు.

తమ పరిస్థితి ఇట్లనే ఉంటే పిల్లలు ఎన్నో మానసిక రుగ్మతలకు గురికావచ్చు అనుకున్నాడు. "ఒరిత్త గందుకా! గది జూసి భయపడుతుందా పిచ్చిపిల్లనా ఏంది గీ ఎక్కుబుద్ధి వెలుతురుకు గట్లకండ్లబడతయి గింతేనె" చెప్పింది సోమి.

''యే దానికేం తెలును చిన్నపిల్లగద ఎట్లనో సముజాయించు నేను గా కరెంటు పనిమీద ఉంట'' అనుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆ తరువాత మొత్తానికి ఎలాగో వాళ్ళను, వీళ్ళను పట్టుకుని ప్రయత్నించి, గుడిసెలకు కరెంటు స్థంభాలు వేయించి తీగలు లాగించి లైట్లు వెలిగేలా చేయించగలిగాడు. అక్కడి ప్రజలకు (లైట్లు) వెలుతురు తెప్పించిన ఘనత దక్కించుకున్నారు. వాళ్ళ జీవితాల్లో కూడా వెలుగు తెప్పించాలని రాజేష్ ప్రయత్నం.

"నేను బండమీద నిలబడిన, నేలమీదగాదు కావాల్నంటె మీరే సూడుండ్రి" అంది గట్టిగా సిన్ని, దాని పరికిణీ మోకాలిదాకా ఎత్తి పట్టుకుని, దాని అరుపుకి గతజ్ఞాపకాల నుండి బయటపడ్డాడు రాజేష్. పిల్లలు "నేలబండ" ఆట ఆడుతున్నారు. వీధి ట్యూబ్‌లైట్ వెలుగులో సిన్ని నిలబడిన బండ అందరికీ స్పష్టంగా కనబడింది. దాని ముఖంలో గెలిచానన్న ఆనందపు వెలుగు ట్యూబ్‌లైట్ వెలుగుతో పోటీ పడుతోంది. ✤

మ్యారేజి బ్యూరోలు

డా॥ముదిగంటి సుజాతారెడ్డి

సూర్యుని ఎండవేడిమికి చలి అప్పుడప్పుడే పారిపోతున్నది. పొద్దున్నంతా పొగమంచు కప్పుకొనివుంది. వాకింగ్‌కు పోదామన్నా వీలుకాలేదు. సూర్యుడు కన్పించగానే పొగమంచు చలి అన్నీ మటుమాయమయ్యాయి. పదకొండయితేచాలు ఎండాకాలంలాగే వుంటుంది. ఇంతకుముందు హైదరాబాద్ అంటే వణికే చలి వుంటుందని మా చిన్నతనంలో స్వెట్టర్లు, శాలువాలు, మఫ్లర్లు, బ్లాంకెట్లతో వచ్చేవాళ్ళం. ఇప్పుడా చలీ వణుకులు లేనే లేవు. తారు రోడ్లు, సిమెంట్ ఇనుములతో కట్టిన మేడలు, అపార్టుమెంటులతో సూర్యుడు వచ్చాడో లేదో వేడెక్కిపోతున్నది. అట్లా వేడి ఎక్కుతున్న సమయంలోనే లలిత వచ్చింది మా యింటికి. పట్టుచీర, లైట్‌గా మేకప్, మెడలో నెక్లెస్‌తో వుంది. దాని అలంకారం చూసి నాకు ఆశ్చర్యం కలిగింది.

"ఏమే లల్లీ! పెండ్లికి పోతున్నావా? దారి తప్పిపోయి ఇటు వచ్చావా?" అని ఎగతాళి నటిస్తూ అన్నానేను.

"పెండ్లి కాదుగాని మ్యారేజ్ బ్యూరోకు పోదాం రా!"

"మ్యారేజీ బ్యూరోనా? ఎందుకు?" అన్నాన్నేను.

సంబంధాలు వెతకటానికి దానికి పెండ్లీడు వాళ్ళెవరూ లేరుమరి!

మ్యారేజీ బ్యూరోకే. పోదాం రా! ఊ వెంటనే తయారు కా". అని తొందరపెట్టింది లలిత.

"అబ్బ! అసలు విషయం చెప్పు. పెళ్ళిళ్ళ బ్యూరోకు ఎందుకు ప్రయాణమిప్పుడు". అడిగాన్నేను అసహనంగా.

అదికాదే! మా మేనత్త తన కూతురు శీలకు ఓ సంబంధం చూడమంది. ఆమె పెండ్లిళ్ళ బ్యూరోల గురించి విన్నదట. ఇప్పుడు పెళ్ళిళ్ళ పేరయ్యలు గాని పెళ్ళిళ్ళలో ముత్తయిదువలు పెళ్ళిళ్ళు కుదర్చటంగాని వుండటం లేదు. వందలు వేలమంది వస్తున్నారు పెండ్లి అంటే. ఆ వందలు వేలమందిలో కులం వాళ్ళెవరో, చుట్టాలెవరో, పక్కావారెవరో తెలియటం లేదు కదా! పెండ్లికి పోయి పెండ్లికూతురు, పెండ్లికొడుకు ముఖాలైనా చూసే అవకాశముండటం లేదు. లైన్‌లో తోసుకుంటూ చేతిలో అక్షింతలు పట్టుకొని మెల్లగా నడిచి నడిచి తోసుకొని తోసుకొని అప్పటికే అలసిపోయి పెండ్లి జంటల ముఖాలు చూసే అవకాశం లేకుండా చేయి పైకెత్తి చేతిలోని అక్షింతలు వాళ్ళవైపు చల్లి గబగబ వచ్చేసరికి భోజనాల దగ్గర అప్పటికే దొమ్ములాట జరుగుతుంటుంది. అందర్నీ తోసుకొని ప్లేటు సంపాదించి ఇంత అన్నం పప్పుచారుతో తినటం ముగించేసి బయటికి వచ్చేసరికి బట్టలన్నీ నలిగి మురికి అయి చిరంజీవి సినిమా రిలీజయిన మొదటిరోజు సినిమా టిక్కెట్లకోసం నిలబడ్డంత పని అవుతున్నది. ఇక పెళ్ళిలో పెళ్ళి సంబంధాలు వెతుక్కునే అవకాశమెక్కడుంటుంది. అసలు ఆ మొన్న మా మామయ్య శీలకు సంబంధం దొరుకుతుందేమోనని ఓ చుట్టాల పెండ్లికి వచ్చాడట. కాని ఆ చుట్టాల పెండ్లే అనుకొని మరో హాల్లో దూరి పెండ్లిజంట మీద అక్షింతలు వేసి భోజనం కానిచ్చేసి బయటికి వస్తుంటే పక్క హాల్లోంచి బయటికి వస్తున్న చుట్టాల ముఖాలు చూసి తన తప్పు తెలుసుకున్నాడట!" నవ్వింది లలిత పెద్దగా. నాకూ నవ్వు వచ్చింది.

"బాగుందే! అవును మరి ఆ పెండ్లి హాళ్ళు కూడా బారులు తీరి ఒకే చోట వుంటున్నాయి. అందుకే పెండ్లి జంటల పేర్లు వ్రాసి బ్యానర్లు వేలాడదీస్తున్నారు. అవి చూసుకునే పోవాలి మరి!" చిరునవ్వు నవ్వాన్నేను.

"సరే! పొద్దెక్కుతుంది పద తయారు కా పోదాం" అని తొందరపెట్టింది లలిత.

"ఇంతకూ... సంబంధం శీలకా ?" అడిగాన్నేను.

"అవునే! రామాయణమంతా విని రాముడికి సీత ఏం కావాలి అన్నట్లుగా వుంది నీ వ్యవహారం!"

"అబ్బ! ఏం లేదులల్లీ! ఈ రోజు నన్ను ఇట్లా దబాయించేస్తున్నావు. చాల మూడ్‌తో వున్నావు" నవ్వాన్నేను.

"పెళ్ళి సంబంధం చూడాల కద! పెండ్లి బ్యూరోలయితే మంచి సంబంధాలు అన్ని రకాలు దొరుకుతాయని మా అత్తకు ఎవరో చెప్పారట. మనక్కావల్సిన సంబంధం మన రేంజిలో ఎంచుకోవచ్చునని ఆమె వెంటనే నన్ను బ్యూరోకు పోయి కనుక్కొమని ఫోన్ చేసింది. పదపోదాం!" మళ్ళా తొందరపెట్టింది లలిత.

నేనూ చీర మార్చుకొని లలితతో బయలుదేరాను. బ్యూరో మెట్లెక్కుతున్నాం.

"ఈ బ్యూరో పేరు ఎవరు చెప్పారే నీకు" అడిగాన్నేను లలితను.

"పేపర్లో చూశాను. పదిరకాల పెండ్లిళ్ళ బ్యూరోల పేర్లు, వివాహ వేదికల పేర్లు ఇచ్చారు. కులాల వారీగా, మతాల వారీగా బ్యూరోలున్నాయి. ప్రకటనలన్నీ చదివితే ఈ బ్యూరో వివరాలు నాకు నచ్చాయి. దీన్ని ఎంచుకున్నాను" అంది లలిత.

ఇద్దరం బ్యూరోలో అడుగుపెట్టాం. బ్యూరో ఆఫీసు ఒక హాలులో వుంది. హాలంతా మనుషులతో హడావిడిగా వుంది. కంప్యూటర్లు చకచక పేర్లను మారుస్తున్నాయి. పైన బల్బుల వెలుతురు. కింద కంప్యూటర్ల వెలుగులు. ఎవరికి వారే మంతనాల్లో మునిగిపోయి వున్నారు. అంతా లొల్లి! వేం వెతుక్కుంటూ బ్యూరో యజమానురాలు మిస్ రోష్నిని చేరుకున్నాం. ఆమె పెద్ద జరీ అంచు పట్టుచీర, మెడలో పొడుగాటి, వెడల్పాటి ధగధగ మెరిసే బంగారు హారాన్ని ధరించింది. గొంతుకు దగ్గరగా మరో బంగారు నెక్లెస్. చేతుల నిండా మలారంలాగా బంగారు గాజులు! పదివేళ్ళకు వివిధ రకాల రాళ్ళు పొదిగిన ఉంగరాలు. అవీ రాళ్ళతో ధగధగ మెరుస్తున్నాయి! నొసట పెద్ద బొట్టు. అందుకేనా లలిత కూడా జోరుగా తయారైవచ్చింది.! అనుకున్నాను రోష్నిని చూసి.

"చెప్పండి ఏం కావాలె!" అడిగింది అచ్చతెనుగులో మమ్మల్ని రోష్ని. ఆమె బల్లఎదురుగా వున్న రెండు కుషన్ కుర్చీల్లో కూర్చున్నాం. నేను లలిత వైపు చూశాను.

"అబ్బాయి కావాలండి..." అని లలిత ముగించనేలేదు రోష్ని అందుకుంది.

"ఏ కులం. ఏ శాఖ, ఏ నక్షత్రం?... ఇక్కడి ఈ దేశంలో నిరుద్యోగా ఉద్యోగంలో వున్నవాళ్ళా? లేదా అమెరికాలో వుండి చదువుకునేవాళ్ళా, ఉద్యోగం చేసేవాళ్ళా?

ఇంజనీరా డాక్టరా కంప్యూటరా... ఎమ్‌బియేనా..ఐఏఎస్సా, ఐపీఎస్సా? వాళ్ళకు కట్నం ఎక్కువే! వాళ్ళకు గిరాకీ ఎక్కువ. ఎక్కువ సంఖ్యలో దొరకరు గదా!

నలుపా? తెలుపా? అమ్మాయి తెల్లగా సన్నగా ఎత్తుగా వుంటె కట్నం తక్కువలో చూస్తాను. కొంత రిబేట్ వుంటుంది. అమ్మాయి నలుపు చామనచాయ అయితే కట్నం కొంచెం ఎక్కువే! అమ్మాయి ప్రొఫెషనల్ అయితే మాత్రం కట్నంలో కొంత రిబేట్ ట్రై చేస్తాను. తర్వాత ఇంకోటి.. ఇన్‌స్టంట్ మ్యారేజ్ కావాలంటే మా ఫీజు కాస్త ఎక్కువగా వుంటుంది.

ఆ.. ఏ ప్రాంతం వాళ్ళు కావాలి... తెలంగాణా? రాయలసీమా? కోస్తాంధ్రా? కోస్తాంధ్రలో మళ్ళా ఉత్తర కోస్తాంధ్ర దక్షిణ కోస్తాంధ్రనా! ప్రాంతాన్ని బట్టి కూడా కట్నాల రేట్లు వుంటాయి! ఊ... చెప్పండి మీకేం కావాలో?

"అంటూ రోష్నీ కంప్యూటర్ బటన్ మీద చేతి వేళ్ళను పెట్టి మా కళ్ళల్లోకి చూసింది. మా లలిత కాస్సేపు తనను తానే మరిచిపోయింది. అయోమయంలో పడిపోయింది. తెల్లబోయి నేనూ లలిత వైపు చూశాను!

మహామంత్రి కుయుక్తి

పి.ఎం.సుందరరావు

కోసల రాజ్యాన్ని వివేకవర్మ పరిపాలించేవాడు. వేరే ఏ ఇతర వ్యాపకాలను పెట్టుకోకుండా నిత్యం ప్రజల సమస్యల గురించి ఆలోచించేవాడు. అంతేకాదు వాటిని తెలివిగా పరిష్కరించేవాడు. అలా మంచి పరిపాలకునిగా పేరు తెచ్చుకున్నాడు. ఇతర రాజ్యాలలో కూడా గుర్తింపు తెచ్చుకున్నాడు.

వివేకవర్మ దగ్గర శ్రీనివాసగుప్తుడు మహామంత్రిగా వుండేవాడు. ఆయనకు బాగా ధనం సంపాదించాలనే కోరిక కలిగింది. అందుకు వివేకవర్మను తన చెప్పుచేతల్లో పెట్టుకోవాలనుకున్నాడు. అనుకున్నదే తడవుగా ప్రయత్నాలు మొదలుపెట్టాడు.

"మహారాజా! మీరు ఎంతోకాలం శ్రమించి మన రాజ్యాన్ని ఆదర్శ రాజ్యంగా తీర్చిదిద్దారు. మీ శిక్షణలో ఉన్నతాధికారులు, అన్ని శాఖల బాధ్యులు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. వీరందరినీ అజమాయిషీ చేయడానికి మహామంత్రిగా నేనున్నాను. కాబట్టి మీరు పరిపాలన గురించి ఎక్కువ శ్రమ తీసుకోకుండా ప్రశాంతంగా వుండండి" అని చెప్పాడు.

ఆ మాటలు విని, పరిపాలనా బాధ్యతల్ని శ్రీనివాసగుప్తునికి అప్పగించాడు వివేకవర్మ. తాను విశ్రాంతి తీసుకోసాగాడు.

శ్రీనివాసగుప్తుడు పరిపాలనా బాధ్యతల్ని తానే నిర్వహించసాగాడు. వివేకవర్మకు విషయాలేమీ తెలియకుండా విందు వినోదాలు అలవాటు చేశాడు. రాజ్యంలో ప్రతి దాని మీద ఎక్కువ పన్నులు వసూలు చేసి, వాటిని తానే కాజేయసాగాడు.

కొంతమంది ఉన్నతోద్యోగులు శ్రీనివాసగుప్తుడు చేస్తున్న అవినీతి పనుల గురించి, వివేకవర్మకు చెప్దామనుకున్నా కలవకుండా చేశాడు మహామంత్రి. అంతేగాకుండా ప్రతిరోజూ సాయంత్రం, "మహారాజా! కొంతమంది ఉన్నతోద్యోగులు మీకు నా మీద లేని పోని చాడీలు చెప్పాలని ప్రయత్నిస్తున్నారు. మీరు మాత్రం నమ్మవద్దు" అని చెప్పేవాడు మహామంత్రి.

తర్వాత కొంతమంది ఉన్నతోద్యోగులు వివేకవర్మను కలిసి మాట్లాడాలని, మహామంత్రి చేస్తున్న దుర్మార్గాల గురించి చెప్పాలని ప్రయత్నించినా, వీలుపడలేదు. వారిని దగ్గరకు కూడా రానివ్వలేదు వివేకవర్మ. చివరకు వారు మహారాణిని కలిసి, విషయమంతా వివరించారు.

ఒకరోజు సాయంత్రం మహామంత్రి శ్రీనివాసగుప్తుడు అంతఃపురంలోని ఉద్యానవనంలో విహరిస్తున్నాడు. కొత్తగా కనిపించిన తోటమాలిని చూశాడు. "ఎవరు నువ్వు? నిన్ను తోటమాలిగా ఎవరు నియమించారు?" అని గద్దించి ప్రశ్నించాడు.

"మహారాణిగారు నన్ను నియమించారు" అని సమాధానమిచ్చాడు తోటమాలి.

"నిన్ను ఎవరు నియమించినా నీకు వేతనం ఇవ్వాల్సింది నేను. కాబట్టి ప్రతి మాసం నీకిచ్చే వేతనంలో కొంత నాకు ఇవ్వాలి. లేకుంటే నిన్ను తోటమాలిగా తొలగిస్తాను. మహారాజుగారు నేనేది చెప్పినా వింటారు" అన్నాడు శ్రీనివాసగుప్తుడు.

వెంటనే తోటమాలి తన మారువేషాన్ని తొలగించాడు. తోటమాలి ఎవరో కాదని మహారాజు వివేకవర్మ అని తెలుసుకుని మహామంత్రి ఒణికిపోయాడు. భయంతో ఏదో సర్ది చెప్పబోయాడు. కానీ మహారాజు కోపంతో మహామంత్రిని పదవి నుండి తొలగించాడు. ఆనాటి నుంచి పరిపాలనా విషయాలు తానే స్వయంగా చూసుకుంటూ ప్రజల కష్టాలను కొద్దిరోజుల్లోనే తొలగించాడు. శ్రీనివాసగుప్తుడి స్థానంలో సమర్థుడైన మరో మంచి వ్యక్తిని మంత్రిగా నియమించాడు.



చిన్నారి చిత్రకారులు



సిహెచ్. హరీష్ పట్నాయక్, 10వ తరగతి,
కోదాడ హైస్కూల్, కోదాడ.



ఎ.మహేందర్, 7వ తరగతి, జడ్‌పిఎస్‌ఎస్,
పాలకుర్తి, వరంగల్-506252.



ఎస్.విజయ్, 7వ తరగతి, జీమ్ రోజెస్ యుపి స్కూల్,
ఆగాపల్లి, మంచాల్, రంగారెడ్డి.

మీరూ ఈ నేస్తాలకు మల్లే చక్కటి బొమ్మలు వెయ్యగలరా! మరి ఆలస్యం ఎందుకు? ఎంచక్కా వేసి మాకు పంపిస్తే ప్రచురిస్తాం. మా చిరునామా:
చిన్నారి చిత్రకారులు, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

ముగ్గురి వయస్సు ఎంత?

జాన్కి ముగ్గురు పిల్లలు. పెద్దవాడు రెండవ వాడికంటే సరిగ్గా నాలుగే... పెద్దవాడు. రెండవవాడు కూడా మూడవ వాడికంటే సరిగ్గా నాలుగేళ్లు పెద్దవా... అంతేకాదు చిన్నవాడి వయస్సు పెద్దవాడి వయస్సులో సగానికి సగం వుంటు... ఇంతకీ ఈ ముగ్గురి వయస్సు ఎంత? విడి విడిగానే చెప్పాలి సుమా! **(జవాబు పైవా...**

లాభం ఎంత?

జవాబు

హేయ్ నేస్తాలూ! గతవారపు ప్రశ్నకు సమాధానం ఏంటో తెలిసిందా! అయితే మేం చెప్పే సమాధానంతో పోల్చుకుని చూడండి. 'మా దేశంలో లీటర్ పాలల్లో అర లీటరు నీళ్లు కలిపి అమ్మితే వచ్చేది లాభం కాదు. జైలు శిక్ష పడుతుంది' అని అందంట రష్యా పాప. అదర్రా సంగతి.

❋



వి'చిత్రం'

చిట్టి పిల్లలూ! పైన మీకోసం వచ్చిన వి'చిత్రం' చూశారుగా. ఆ బొమ్మల... మీకేం కనిపించిందో చెప్పండి చూద్దాం. సరిగ్గా చెప్పేస్తే మీ అందరికీ అభినందనల... చెప్తాం. య్యాస్. 'అదో మంచు ప్రాంతం. ఆ మంచులో ఎవరో చెప్పులు, బూట... వంటివేం లేకుండా నడిచి వెళ్లారు. ఆ ముద్రలు అవే' అంటున్నారు కొందర... నేస్తాలు. వారు చెప్పినంత వరకు కరెక్టే. కానీ మనుషుల కాలి వేళ్లకు అంత పొడ... గోళ్లు వుండవుకదా. చూస్తే అదేదో జంతువు పాదముద్రలు లాగా వున్నాయి. ఆ... జంతువు కూడా పైన బొమ్మలోనే వుంది. నిజ్జం. కావాలంటే... ఎడమవైపు ప్యానల్లో పరికించి చూడండి. కనిపించిందా ఎలుగుబంటి! అదే మంచులో నడుచుకుంటూ వెళ్లి అక్కడ కూర్చుంది.

❋

హేయ్ నేస్తాలూ! ఈ వారం మీ ముందుకు ఓ అక్క వచ్చింది. ఏంటి? ఆమెను చూడగానే ఎవరో తెలిసిపోయిందా. మరైతే ఆలస్యమెందుకు? వెంటనే కార్డుమీద రాసి మాకు పంపండి. మీ పేరు, తరగతి, ఊరు ప్రచురిస్తాం. మా చిరునామా: **వీరివీరి గుమ్మడిపండు వీరిపేరేమి?** బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

వీరి వీరి గుమ్మడిపండు... వీరి పేరేమి?

సరైన సమాధానాలు రాసినవారు

సిహెచ్ చిత్రాంజని 5వ తరగతి, సిహెచ్. గీతాకృష్ణ 7వ తరగతి, కాకినాడ. బి.విఘ్నేష్ 7వ తరగతి, మాలూరు. కె.సరిత, డి.నందిని 9వ తరగతి, వనపర్తి. వి.అమ్మాజీ, 8వ తరగతి, భీమునిపట్నం. కె.శ్రీఅనూహ్య 6వ తరగతి, గుంటూరు. కె.నూకినాయుడు 7వ తరగతి, రోలుగుంట. పి.రమాదేవి, 8వ తరగతి, బాలికల గురుకుల పాఠశాల. వి.సౌమ్య, 5వ తరగతి, వి.రాజావంశీధర్, 7వ తరగతి, ఈమని. సి.కౌసల్య, ఎదుల, మహబూబ్‌నగర్. జి.జ్ఞానేశ్వరి, 10వ తరగతి, ప్రగతి హైస్కూల్, వల్లభ్‌నగర్, వనపర్తి. జి.తేజ, 6వ తరగతి, ప్రజ్ఞాగ్రామర్ స్కూల్, వనపర్తి. జి.కృష్ణయ్య, బండార్‌నగర్, వనపర్తి. పి.రమ్య 6వ తరగతి, పణిదెం. ఐఆర్. జయలక్ష్మి 5వ తరగతి, శ్రీ అరబిందో ఇంటర్నేషనల్ స్కూల్, విద్యానగర్, హైదరాబాద్. పి.జయశ్రీ, సాంబశివనగర్, గుంటూరు.

గతవారపు జవాబు: **చుక్కా రామయ్య** ❄

తేడాలు కనుక్కోండి



చిన్నారులూ! మీకోసం అడవినుంచి రెండు జిరాఫీలు వచ్చాయర్రా! అవి మీతో మాట్లాడాలంట. అందుకే చక్కగా 'ప్రజాశక్తి ఆఫీసు ఎక్కడుందా?' అని వెతుక్కుంటూ వచ్చాయి. వాటి ఫొటోలు తీసి ఆదివారం పుస్తకంలో పెట్టాల్సిందేనని మారాం చేశాయి. దాంతో కాదనలేక ఆ పని చేసేశాం. అసలు విషయం ఏంటంటే అవి రెండూ కవలలు. కాకపోతే రెంటిల్లోను ఆరు తేడాలున్నాయి. అవేంటో మీరు ఇట్టే కనిపెట్టాలి.

మీకో రహస్యం చెప్పమంటారా! అలా కనిపెట్టిన వారిని జిరాఫీలు మెచ్చుకుంటాయంట. ఆనక మీ ఇష్టం. ❄

పేపరుతో తామర



హలో.... ఏం చేస్తున్నారు? పెద్ద! వారం వారం 'కాగితంతో బొమ్మలు చేయడం వచ్చా? వస్తే రాసి పంపండి' అని అడుగుతూనే వున్నాం. కానీ మీరెవ్వరూ పంపలేదు. కానీ... **టి.రాజశేఖర్** (9వ తరగతి, చింతూరు, ఖమ్మం) అనే నేస్తం మాత్రం కాగితంతో తామరపువ్వు ఎలా చెయ్యాలో రాసి పంపాడు. ఆ చిట్టి నేస్తానికి మా అభినందనలు చెప్తున్నాం. మరి చదివి మీరూ చేస్తారుగా.

కావలసిన వస్తువులు: రంగు కాగితాలు, కత్తెర.

ఎలా చెయ్యాలంటే...

1.ముందు రెండు రంగుల కాగితాలను తీసుకోండి. మొదట ఒక కాగితాన్ని చుట్టండి. ఇంక అది అయిపోతుంది అన్నప్పుడు రెండో దాన్ని కూడా దానిమీద పెట్టి చుట్టాలి. 2.తర్వాత రెండవ బొమ్మలో చూపించినట్టుగా నగ భాగం నుంచి కత్తిరించండి. రోలు సగ భాగాన్ని ఆకు మాదిరిగా కత్తిరించండి. 3. రోలు పై భాగంలో కొద్దిగా కాగితాన్ని పట్టుకుని నెమ్మదిగా లాగండి. 4. ఎలాగంటే... ఆకులు వరుసగా రావాలి. అలా నెమ్మదిగా లాగండి. 5. తర్వాత దాన్ని అటూ ఇటూ తిప్పండి. ఆకులు రోల్ చుట్టూ తిరుగుతాయి. 6. ఇంక ఆ తర్వాత నెమ్మదిగా ఆకులను ఒక దగ్గరకు వత్తండి. 7. తర్వాత రోలు పైభాగం నుంచి ఆకులను తెరవండి. అంతే. తామరపువ్వు తయార్. దీన్ని ఫ్లవర్ వాజ్‌లో పెడితే సూపర్‌గుంటుంది. ఒకటి రెండు సార్లు విఫలమైనా తర్వాత వచ్చేస్తుంది. చేస్తారుగా మరి.

పేపర్ బొమ్మలు చెయ్యడం మీకూ వచ్చా?

ఫ్రెండ్స్! మీకు కాగితంతో బంతి, విసనకర్ర, టోపీ, నాలుగు గిన్నెలు, రెండు పడవలు, కత్తిపడవ ..వంటివి చేయడం వచ్చే వుంటుంది. వాటిని కార్డుమీద వివరంగా రాసి పంపిస్తే ఎంచక్కా మీ పేరు, తరగతి, ఊరుతో సహా ప్రచురిస్తాం. మా చిరునామా: పేపర్ బొమ్మలు, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్ నగర్, హైదరాబాదు.

మహారాణి

పొత్తూరి రాజేంద్రప్రసాద్‌వర్మ

ప్రదర్శన హాలు విశాలంగా ఉంది. హాలు ముందు రకరకాల వాహనాలు ఆగి ఉన్నాయి. చాలామంది వస్తున్నారు. ఆసక్తిగా లోపలికి వెళుతున్నారు.

కొంతమంది దుస్తులను, ఇతర వస్తువులను కొనుగోలు చేసి వస్తున్నారు. మరికొంతమంది లోపలంతా కలియ తిరుగుతూ అక్కడ ప్రదర్శించిన వస్తువులను చూస్తున్నారు.

అది మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్.

గ్రామం చిన్నదే అయినప్పటికీ సమావేశాలు, కార్యక్రమాలకు ఎక్కువమంది వస్తుంటారు. పది పదిహేను గ్రామాలకు కేంద్రంగా ఉండటం వల్ల రద్దీగా ఉంటుంది.

అందుకే "వరల్డ్ విజన్ సంస్థ" ఆ ప్రాంతాన్ని ఎన్నుకొంది.

సంస్థ ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఆ కేంద్రంలో శిక్షణ పొందిన వారు తయారుచేసిన అల్లికలు, కుట్లు, ఇతర వస్తువులను వారు ప్రదర్శించారు. కొన్ని తయారీ వస్తువులకు ధరలను నిర్ణయించి అమ్మకాలకు కూడా పెట్టారు.

గ్రామంలో ముందుగా ప్రచారం చేయడంతో చాలామంది ఆ ప్రదర్శనకు హాజరయ్యారు. చాలా గ్రామాల్లో ఉన్న మహిళా సంఘాలకు కూడా కబురు చేయడంతో మహిళలు ఎక్కువమంది వచ్చారు.

విశాలమైన హాలులో వరుసగా టేబుళ్లను పెట్టి వాటి పైన చేతితో తయారైన వివిధ రకాల సామాగ్రిని ప్రదర్శనకు నదుస్తూ చూడటానికి వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేశారు.

ప్రదర్శనకు వచ్చినవారు తయారైన వస్తువులను చూసి ఎంతో ముగ్ధులయిపోయారు. ముఖ్యంగా ఎంబ్రాయిడరీ చేయడం చాలామందిని ఆకట్టుకుంది. కొన్ని వస్తువులైతే చేతితో తయారుచేసినవంటే నమ్మకం కుదరడం లేదు.

రోడ్డు పక్కనున్న ప్రదర్శనకు తల్లీకూతుళ్లు ఇద్దరూ వెళ్లాలని తచ్చాడుతున్నారు. కూతురి చేయి పట్టుకుని తల్లి ప్రదర్శన వారిని ఆకర్షించింది. అటుగా వెళ్తుండగా ఆ ప్రదర్శన హాలు వద్దకి తీసుకువచ్చింది.

స్కూటర్లు, ఆటోలపై వస్తున్నవారు... చేతిలో వస్తువులతో లోపలి నుంచి బయటకు వస్తున్నవారిని చూసి రాణిలో బెరుకుతనం మొదలైంది. పెద్దపెద్ద వాళ్లున్న ఆ ప్రాంతంలోకి వెళ్లడానికి సందేహపడింది.

తల్లి చేతిని పట్టుకుని వెనక్కిలాగింది.

కూతురు సంశయాన్ని చూసి ఆమె ఊరడించింది.

"పర్వాలేదు. అందరూ చూడటానికే ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నారు. పద మనం కూడా చూద్దాం!" అంది.

ప్రదర్శన హాలు వైపు రెండు అడుగులు వేసింది.

వీరి తటపటాయింపు చూసి లోపల నుంచి ఒకామె బైటికి వచ్చింది. ఆమె ప్రదర్శన ఏర్పాటు చేసిన సంస్థకు ప్రతినిధి. ఆమె పేరు సుశీల. ఆమె ద్వారం వద్ద బిడియంగా నిల్చున్న తల్లీకూతుళ్ల వద్దకు వచ్చి-

''రండి పర్వాలేదు. అందరూ చూడటానికే ఈ ప్రదర్శన ఏర్పాటు చేశాం. కుట్టుమిషన్లతో కుట్టినవి అల్లికలు చేసినవి మొదలైన వస్తువులన్నీ ఉన్నాయి. మీలాంటి వారే వీటిని తయారుచేశారు. సందేహపడకుండా చూడండి!" అంటూ లోపలికి పంపించింది.

రాణి తల్లితో లోపలికి వెళ్లింది.

ఆ ప్రదర్శన హాల్లో వివిధ విషయాలను వివరించడానికి ఎంతోమంది యువతులు కౌంటర్ల వద్ద ఉన్నారు. వివిధ రకాల సామాగ్రి వస్తువులను అక్కడ వేలాడదీసారు.

ప్రదర్శన రాణికి ఎంతో నచ్చింది.

రకరకాల వస్తువులు ఎంతో ఆకర్షణీయంగా ఆమెను ఆకట్టుకున్నాయి. నచ్చిన వాటివద్ద నిలుచుంటే అక్కడి కౌంటర్లలో మహిళలు అవి ఎవరు కుట్టారు... ఎలా కుట్టారన్న విషయాలను వివరించి చెప్పారు. వాటన్నింటినీ రాణి ఎంతో ఆసక్తిగా వింది.

ప్రదర్శనకు వస్తున్నవారి అందరి వైఖరికి భిన్నంగా ఉన్న రాణి ఆసక్తి అక్కడి వారిని ఆకట్టుకుంది. పదహారేళ్ల వయస్సులో ఆ ఆసక్తి సహజంగా ఏర్పడుతుంది. అయినప్పటికీ ప్రత్యేక తరహాలో ఉన్న ఆమె పరిశీలనను కొంతమంది మహిళలు గమనించి సుశీలకు చెప్పారు.

సుశీల తల్లీకూతుళ్ల వద్దకి వచ్చి-"నచ్చిందా?" అంది.

రాణి నవ్వి ఊరుకుంది. రాణి తల్లి మాత్రం-''చాలా బాగుందమ్మా! అనుకోకుండా బాలానగర్‌లో మీ ప్రదర్శన చూడటం జరిగింది. తయారైన వస్తువులన్నీ ఎంతో చక్కగా శ్రద్ధగా చేసినట్లు అర్థం అవుతోంది!" అంది.

"థ్యాంక్యూ!" అంటూ సుశీల రాణి వైపు తిరిగి-"నీకూ బాగా నచ్చినట్లుంది కదూ?" ప్రశ్నించింది.

"అవును" అన్నట్లుగా రాణి తలాడించింది.

''నువ్వు కూడా ఇలాంటి కుట్టుపని నేర్చుకుంటావా? ఇవన్నీ చూసిన తర్వాత మనం కూడా వీటన్నింటినీ తయారుచేస్తే బాగుంటుంది కదా అనిపిస్తోంది అవునా?" అంది.

రాణి మళ్లా తలాడించింది.

"నేను ఇన్ని మాట్లాడుతుంటే నోరు మెదపవేం?" సుశీల మాటల్లో ఒకలాంటి చిరాకు తొంగి చూసింది.

అప్పుడు రాణి తల్లి కలగజేసుకుని-"అమ్మా! మా రాణికి నోరు లేదమ్మా. పుట్టుకతోనే మాటలు రాలేదు. అందుకే ఏమీ మాట్లాడటం లేదు. ఇటువంటి మూగ అమ్మాయికి మీలాంటి వారే ఏదో సాయం చేయాలి!'' అభ్యర్థించింది.

ఆమె మాటలు విని సుశీల చలించిపోయింది.

కుందనపు బొమ్మలా ఉన్న రాణికి మాటలు రావంటే ఆమె మనసు ఏదోలా అయిపోయింది. సారీ... ఆయాం వెరీ సారీ! అని అంది. ఆ మాటలు విన్న రాణి 'పర్వాలేదు' అన్నట్లు కళ్లను కిందకు వాల్చింది.

తర్వాత రాణి తల్లి దగ్గర నుంచి వారి కుటుంబ వివరాలు, చిరునామా తీసుకుంది.

తర్వాత లోపలి నుంచి అందంగా డిజైన్ చేసి అల్లికలు చేసిన జేబు రుమాలును తీసుకుని వచ్చి-"తీసుకో... దీనికన్నా ఆకర్షణీయమైనవి నువ్వు కూడా తయారు చేయాలి!" అని రాణి భుజం తట్టి అందించింది.

రుమాలును రాణి సంతోషంగా తీసుకుంది.

ఆ తర్వాత మిగిలిన వస్తువులను చూసి ప్రదర్శన హాలు నుంచి బైటికి వచ్చారు తల్లీ కూతుళ్లు.

తమ గ్రామం వెళ్లే బస్సు కోసం ముందుకు కదిలారు.

* * *

మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలో బోడ జానంపేట చిన్న కుగ్రామం.

సోమయ్య, దానమ్మ దంపతులు కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నారు. వారికి మధ్య తరగతి స్థాయి దాటని పేదరికంతో కూడిన పరిస్థితి. వారు ఇద్దరూ ఆ సమీపంలో ఉన్న కొండక్వారీకి వెళ్లి రాళ్లు కొడుతుంటారు. ఇలా కొట్టినందుకు భర్తకు యాభై రూపాయలు, భార్యకు 30 రూపాయలు కూలీగా లభిస్తుంది. ఆ కూలితోనే కుటుంబాన్ని పోషిస్తున్నారు.

ఇద్దరు సంతానంలో పెద్ద కూతురు దేవికి చిన్నతనంలోనే పోలియో సోకి రెండు కాళ్ళూ చచ్చుబడిపోయాయి. దీంతో ఆమెను సంరక్షించడానికే ఆ కుటుంబం ఎంతో కష్టపడింది. నడవలేని స్థితిలో ఆమె పోషణ భారం భార్యాభర్తలు ఇద్దరికీ ఎంతో భారంగా తయారైంది.

రెండవ కుమార్తె రాణి.

ఆమె పరిస్థితి కూడా పెద్ద కుమార్తె మా పెరిగానే వారికి భారంగా అయిపోయింది. పుట్టుకతోనే మూగ, చెవుడు ఉండటంతో తల్లిదండ్రులు ఇద్దరూ తల్లడిల్లిపోయారు. పిల్లలు పెద్దవాళ్లు అవుతుంటే వారి అవసరాలు కూడా పెరిగాయి. కుటుంబ పోషణ కూడా ఎంతో కష్టం అయిపోయింది.

దేవి ఇంటిలో వంటపని చేయడానికి ఉండిపోయేది.

సోమయ్య, దానమ్మ క్వారీ పనికి ప్రతిరోజు వెళ్లేవారు.

రాణి కొంతకాలం అక్కకు సాయంగా ఉండేది. వయసు పెరిగినకొద్దీ అలా ఉండలేకపోయింది.

తల్లిదండ్రులకు తాను కూడా సహాయకారిగా ఉండాలని నిర్ణయించుకుంది.

భార్యాభర్తలు ఇద్దరూ క్వారీ పనికి వెళ్లగా రాణి కూలి పనికి బయలుదేరేది. వేడి నీళ్లకు చన్నీళ్లు సాయం అన్నట్లుగా సంపాదించి తెచ్చిన కూలి డబ్బులు తల్లిదండ్రుల చేతిలో పోసేది. ఆమె అవసరాలన్నీ వారే చూసేవారు.

చిన్నతనం నుంచి చదువుకోవడానికి అవకాశం లభించలేదు. అందుకే పనుల మీదే దృష్టి పెట్టేది. చేసిన ఏ పని అయినా శుభ్రంగా చేయడం.. అందరూ మెచ్చుకొనేలా చేయడం రాణి ప్రత్యేకత. ఇందుకోసమే ఎక్కువగా కృషి చేసేది.

దాంతో ఆమెకు ప్రత్యేకమైన గుర్తింపు లభించింది.

బాలానగర్‌లో సంతకు వెళ్లినప్పుడు తల్లితో కలసి చూసిన ఎగ్జిబిషన్ రాణిని విపరీతంగా ఆకట్టుకుంది. అటువంటి వస్తువులు తయారు చేయడానికి తాను ఎందుకు ప్రయత్నించకూడదని అనుకునేది. చేస్తున్న కూలిపని ఆమెకు విసుగు కలిగించేది. నిరాశా నిస్పృహలతో ఈ పనులు చేసేకన్నా తాను ఆసక్తి ఉన్న రంగంలో కృషి చేస్తే ఎంతో ఫలితం ఉంటుందని అనుకొనేది.

ఆ సమయంలో వరల్డ్ విజన్ ప్రతినిధి సుశీల ఒకరోజు బోడజానంపేట గ్రామానికి వచ్చింది. ఎప్పుడో డైరీలో రాసుకున్న రాణి చిరునామా వెతుక్కుని ఆమె ఇంటికి వచ్చింది.

సుశీలను చూసి రాణి ఆశ్చర్యపోయింది.

కమ్మలశాలలోకి వెళ్లి పాత చాపను తీసుకువచ్చి పరిచి దానిపై కూర్చోమని ఆహ్వానించింది.



"ఈ ప్రాంతంలో నిరుపేద మహిళలందరికీ ఉపాధి కల్పించడానికి శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. కుట్టుమిషన్లు తీసుకువచ్చి మేమే కుట్టుపని, అల్లికలు పని, ఎంబ్రాయిడరీ చేయడం వంటివి నేర్పిస్తాం. మహిళలు తయారుచేసిన రకరకాల వస్తువులను మార్కెట్ చేయిస్తాం!" సుశీల వివరించింది.

ఆ మాటలు విని రాణి తల్లి ఎంతో సంతోషించింది. -"అమ్మా! ఎంతో చల్లని మాట చెప్పావు. బాలానగర్‌లో మీరు చూపించిన వస్తువులు చూసినప్పటి నుంచీ తానూ అట్లువంటివి చేస్తానని మా రాణి ఎంతో ఉబలాటపడుతోంది. ఏదో కూలి చేసుకుని బతుకుతున్నాం. మనకెందుకని చెప్పినా వినడం లేదు. మీ కోసం రెండుసార్లు బాలానగర్ వచ్చాను. వివరాలు కనుక్కోలేకపోయాను. ఇప్పుడు దేవతలా అనుకోకుండా మీరే వచ్చారు. మా రాణిని కూడా మీ కుట్టుశిక్షణలో చేర్చుకోండి!" అభ్యర్థించింది.

సుశీలతో తల్లి మాట్లాడుతున్న విషయాలను రాణి శ్రద్ధగా గమనించింది. వారు మాట్లాడుకున్న విషయాలు తనకు వినిపించకపోయినా పెదాల కదలిక ఆధారంగా అర్థం చేసుకుంది.

ఆమె మోహంలో అదోలాంటి సంతృప్తి మెరుపు మెరిసింది.

"కుట్టు శిక్షణ నేర్చుకుంటావా?" సైగలతో సుశీల రాణి వైపు తిరిగి ప్రశ్నించింది.

రాణి ఆనందంగా తల ఆడించింది.

ఆ తర్వాత చకచకా ప్రయత్నాలు జరిగిపోయాయి.

ఆ సమీపంలో కుట్టుశిక్షణా కేంద్రం ప్రారంభం అయింది. పరిసర ప్రాంతాలకు చెందిన ముప్పయిమంది మహిళల్ని అందులో చేర్చుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటవరకు శిక్షణ సమయంగా నిర్ణయించారు.

రాణి కూలిపని మానేసి అందులో చేరింది.

మొదట తల్లిదండ్రులు ఆసక్తి చూపించలేదు. అయితే రాణి చూపించిన ఉత్సాహం, శిక్షణతో బాటు రోజుకు ఇరవై రూపాయలు భత్యం ఇవ్వాలని స్వచ్ఛంద సంస్థ నిర్ణయించడంతో ఆ తర్వాత పెద్దగా అభ్యంతరం చెప్పలేదు.

ఆ శిబిరానికి సుశీల నిర్వాహకురాలుగా నియమితురాలైంది.

ముందుగా కుట్టుమిషను ద్వారా చిన్నచిన్న బట్టలు ఎలా కుట్టాలన్న విషయాన్ని నేర్పించారు. తర్వాత వివిధ రకాలైన అంశాలను చెప్పేవారు.

ఈ పనిమీద ఎంతో ఆసక్తిని పెంచుకున్న రాణి ఒకసారి చెబితే చాలు వెంటనే అర్థం చేసుకునే సామర్థ్యంతో పనిపట్ల ఆసక్తిని పెంచుకుంది. ఎంబ్రాయిడరీ, ఉలెన్ అల్లికలకు సంబంధించిన విషయాలను నేర్చుకుంది. ఈ విషయాలను బోధకురాలు ఒకటికి రెండుసార్లు చెప్పడం, చేసి చూపించడం వంటివి చేస్తే తప్ప ఇతరులకు అర్థం అయ్యేవి కాదు. కాని రాణి అవగాహన అందుకు భిన్నంగా ఉండేది. ఏ రకమైన కుట్టు అయినా డిజైన్ అయినా వెంటనే గుర్తించి అదే విధంగా చేసేది.

రాణి పనితీరును చూసి అందరూ ఎంతో ఆశ్చర్యపోయేవారు.

బట్టలు కుట్టడం నేర్చుకోవడంతో బాటు బట్టలకు రకరకాల డిజైన్‌లు చేయడంలో రాణి అందెవేసిన చెయ్యిగా పేరు సంపాదించుకుంది. ఊలుతో టెలిఫోన్ క్లాత్, టీవీ క్లాత్‌లు తయారు చేయడంతో ఈమెకు ఎంతో ప్రత్యేకత ఉండేది.

ఈ శిక్షణా కేంద్రంలో మహిళలు తయారుచేసే వివిధ రకాల వస్తువులను అమ్మకాలకు కూడా పెట్టేవారు. వివిధ ప్రాంతాలకు చెందినవారు వచ్చి కొనుగోలు చేసేవారు. ముఖ్యంగా రాణి తయారుచేసిన సామగ్రి ఇతరులను విపరీతంగా ఆకర్షించేది. చాలామంది వాటినే కావాలని కోరుకునేవారు. ఆ సంస్థలో ఈ విధంగా లభించిన ఆదాయంతో నిర్వహణ ఖర్చులకు ఉంచుకొని మిగిలిన దానిని తయారుచేసిన వారికే ఇచ్చేవారు.

ఈ ఆదాయం రాణికి కొంత వెసులుబాటు కలిగించేది.

* * *

బాలానగర్

ఆడిటోరియం ప్రాంతంలో గృహాలంకరణ సామగ్రి ప్రదర్శన ఏర్పాటైంది. అందులో ఎంబ్రాయిడరీ చేసిన డోర్ కర్టెన్లు, శాలువాలపై డిజైన్లు, టెలిఫోన్, టీవీ క్లాత్‌లు తయారీ, చిన్న పిల్లలు ధరించే ఊలు బనియన్లు... ఒకటేమిటి రకరకాల సామాగ్రిని అందులో ప్రదర్శించారు.

వివిధ ప్రాంతాలకు చెందినవారు వాటిని చూసి ముగ్ధులయిపోయారు. రెడీమేడ్ వస్తువుల మాదిరిగా ఉన్న వాటిని కొనుగోలు చేయడానికి కూడా ఎంతోమంది ఆసక్తి చూపించారు. పరిసర గ్రామాలకు చెందిన మహిళా స్వయంశక్తి సంఘాల సభ్యులను కూడా ఆహ్వానించడంతో వారు కూడా విచ్చేశారు.

ప్రదర్శన ముగిసిన తర్వాత సాయంత్రం అక్కడి ఆవరణలో చిన్నసభను ఏర్పాటు చేశారు. బాలానగర్‌లో ఉన్న మండలస్థాయి ప్రముఖులంతా హాజరయ్యారు. ఆ సమావేశానికి సుశీల స్వాగతం పలుకుతూ-

"రెండేళ్ల క్రితం ఇదే ప్రాంతంలో ఏర్పాటైన ప్రదర్శన పట్ల ఆసక్తితో తాను శిక్షణ పొంది సొంతంగా ఇన్ని వస్తువులు తయారు చేసిన యువతి ఎందరికో ఆదర్శ నీయురాలు...

ఆమె రాణి.." అంటూ వేదికపైకి ఆహ్వానించింది.

రాణి బెరుగ్గా వచ్చి కుర్చీలో కూర్చుంది.

తర్వాత అధికారులు అనధికారులు ఆమె కృషిని వివరించి అభినందనలు అందజేశారు.

తర్వాత రాణిని మాట్లాడమని ఆహ్వానించారు.

రాణి సైగల ద్వారా సుశీలకు విషయాలను వివరించి మౌనంగా కూర్చుండిపోయింది.

సుశీల లేచి-"రాణి మీ మాటలు వినలేదు. కానీ అర్థం చేసుకోగలదు.. మీతో మాట్లాడలేదు. కాని తన సైగల ద్వారా మనసులో మాటను మీకు చెప్పగలదు.. ఈ అభినందనకు రాణి పొంగిపోతోంది. ఈ కుట్టుశిక్షణ అల్లికలు, నేర్చుకోవడం ద్వారా తన వైకల్యాన్ని మరిచిపోయానని అంటోంది. ప్రభుత్వం నుంచి సహకారం లభించినట్లయితే ఎంబ్రాయిడరీ మిషను కొనుగోలు చేసుకుంటానని అంటోంది. తనలాంటి మరికొంత మంది మహిళలకు ఉపాధి కల్పిస్తానని చెబుతోంది. ఈమెతో కొంతకాలంగా ఉన్న సాన్నిహిత్యం వల్ల రాణి సైగల భాషను పూర్తిగా అర్థం చేసుకుని ఈ విషయాలు చెబుతున్నాను... వైకల్యం కలిగిన ఎంతోమంది నిరాశా నిస్పృహల్లో కూరుకుపోయి ఎందుకూ కొరగాకుండా తయారవుతున్న పరిస్థితుల్లో ఈమె కృషి ఎంతో మందికి ఆదర్శనీయం..." చెప్పింది.

సుశీల మాటలకు మహిళలంతా చప్పట్లతో అభినందనలు తెలియజేశారు.

సుశీల మాటలు వినబడకపోయినా ఆమె చెప్పే విధానం... పెదవుల కదలిక రాణికి అర్థమయ్యాయి. వచ్చిన వాళ్లు కొడుతున్న చప్పట్లు ఆమె హృదయంలో ప్రకంపనలు కలిగించాయి. అప్రయత్నంగా వెచ్చని కన్నీళ్లు రాణి కళ్ల నుంచి బైట పడ్డాయి.

"సాహసం సేయవే ఢింబకీ...సొమ్ములొచ్చునులే!"

త్రినేత్రి

"సాహసం సేయరా ఢింబకా... రాకుమారి దక్కునులే" అని ఎస్వీరంగా రావు అనంగానే మా ఎన్టీవోడు నిలువునా నిప్పుల గుండంలో దూకీసీవోడు...అని మా దూరబ్బంధువు ఒకావిడ ఒకటే తన్మయత్వంతో చెప్పుకుపోతోంది.

ఆవిడ విజయనగరం నుండి వచ్చిందిలేండి...

సాహసం సేయరా ఢింబకా అనంగానే మా లాంటి వాళ్ళకు...మా పెద్దాళ్ళకు అయితే ఠక్కున పాతాళభైరవి సినిమా సంగతని గుర్తుకు వస్తుంది.

కానీ నేటి కుర్రతరాలకు...

నేటి ఒకానొక టీవీ ఛానల్‌వారి కార్యక్రమం, ఆ పొడుగాటి యాంకరమ్మాయి గుర్తుకువస్తుంది.

ఆ అమ్మాయి పనిచేసే టీవీ ఛానల్ యాజమాన్యం రూపొందించిన కాయ్ రాజా కాయ్ పందేలు గుర్తుకువస్తాయి.

ఆ పందేల పేరిట చేయించే రకరకాల వికారవిన్యాసాలు గుర్తుకువస్తాయి.

ఆ వికారాలకొచ్చిన పందెపు డబ్బు నోట్లు అక్కడ చేరిన వారికి కనబడేలా లెక్కపెట్టడం గుర్తుకువస్తుంది.

ఆ లెక్క ఛానళ్ళ తెరల్లోంచి మనందరికీ కనబడ్డం, వినబడ్డం గుర్తుకువస్తుంది.

ఇటీవల ఆ వందేలలో పాల్గొని, సాహసాలు చేసి సొమ్ములు గెలుచుకున్న మహిళామణులుకూడా ఉన్నారని తెలిశాక మనలాంటి వాళ్ళం ఆ కాసేపన్నా ఆనందించొద్దా చెప్పండి !

ఆడవాళ్ళకు కూడా సాహసాల పోటీ పెట్టేసి డబ్బులు దండిగా వస్తాయి...ఆ కాసేపు భరించేయండి అంటూ ధైర్యానికి, సాహసానికి రేటు వినిపించాక ఆడంగులం ఆగుతామా చెప్పండి ! ఏ చీరెకో, రవికకో....పిల్లదానికి లంగావోణీకో వస్తాయికదా అనుకుంటుందా ఆడకూతురు.

ఈ 'సాహసం సేయరా ఢింబకా' ఎపిసోడ్ ఓ ఇంగ్లీషు ఛానల్ నుండి తీసుకున్న ఎంగిలి కాన్సెప్టేననుకోండి.

'డేర్ టు విన్' అనో...'డేర్ డెవిల్స్ కాంపిటీషన్' అనో దానికి టైటిలుంటుందిలేండి. 'డేర్ టు విన్ డాలర్స్' అని సబ్‌టైటిల్ కూడా ఉంటుందిలేండి !

సదరు ఎపిసోడునందు ఛండాల, అంకఛండాల, పరమఛండాల అంశాలపై పోటీలుండును.

అవి చూచువారలకు బీభత్స, అరిబీభత్స, అరివీరబీభత్సములగు భావములు జుగుప్స అనబడు స్పెషల్ ఎఫెక్ట్‌తో కలుగుచుండును.

ఇంతకీ మచ్చుకి ఆ పోటీలలో రెండో మూడో ఇక్కడ చెప్పుకుందామా. మీకు యాక్ అనిపించినా...ఛీ పాడు అనిపించినా నాది పూచీకాదను పూచీకత్తుతో ఈ ఉదాహరణ ఇచ్చుకొనుచుంటినని మనవి.

ఓ తెల్లదేశపు తెల్లింటి ఆడపడుచు యాంకర్ పిలుపుతో వచ్చిందండి. ఆమె వచ్చీరాగానే తన ఓవర్‌కోటు విప్పి కేవలం బ్రా, కట్‌డ్రాయర్‌తో ఉంది.



అదొక సాహసం మరి! ఇక ఆ తెల్ల అమ్మణి అదేదో జిగటజిగటగా కనబడుతున్న ద్రవంలో ఉన్న తెల్లటి లద్దెపురుగులున్న గాజుతొట్టెలోకి దిగింది. ఆ లద్దెపురుగులన్నీ ఆమె ఒంటిపై పాకుతూ...నోట్లోకి, ముక్కులోకి వెళ్ళి వస్తూ...అవి వదిలే రీసెస్‌లు, చొంగలు...అవన్నీ కలగలిసిన ఆ తెల్లటి...

...అదిగో చెప్పానా...మీకు యాక్ అనిపిస్తే నాది కాదు బాధ్యతని.

ఇంకో ఎపిసోడ్ సాహసాన్ని చేస్తున్న మన ఇంతి సంగతి చెబుతానంటే కూడా ఇందాకటి సీను వర్ణన మిమ్మల్ని బెదరగొట్టినట్లుంది కదా...

అసలింతకీ మన మహిళలింతటి సాహసానికి ఎందుకు ఒడిగట్టినట్లు ?!

ఈ ఛానళ్ళు ఇలాంటి సాహసాలకు ఆడవారిని గురిచేసి వారికేమి నేర్పుతారట !?!?!?

పులిని చూసి వాతలు పెట్టుకోవడం మన జానపదకథల్లో కూడా ఉన్నదే కదా!

ఆ కథ వరసాన మన తెలుంగు ఛానళ్ళవారు కూడా మన ఆడవారి తెగువను చూపించాలని ఈ సాహసాల పోటీలు పెట్టారు కదా !

ఆ మధ్య మా ఊళ్ళో పెట్టిన ;ఛానల్ సాహసంలో ఒకావిడ...పెద్దపెద్ద పాములున్న పెట్టెలో పడుకుంది. ఆ పాములు రెండూ తన ఒంటిపై జరాజరా పాకినా భయపడకుండా ఉంది. యాంకరిణి తన చేతి స్టాప్ వాచీలో టైమ్ చూసుకుంది. ఇంకొక్క నిముషం, ఇంకొక్క అరనిముషం, ఆఖరి పావునిముషం... ఇలా చేతిలో వెయ్యిరూకల నోట్లు చూపిస్తూ ఊరిస్తోంది మరి.

ఆ నోట్లు గెలుచుకున్న ఆవిడ విజయగర్వంతో వెయ్యినోట్లు అందుకుంటున్న ఆనందంతో పాటు ఆవిడ ముఖం కూడా చూశానండి.

ఆవిడెవరో కాదు. నా చిన్నప్పుడు మా ఇంట్లో మా అమ్మకు చేతిసాయంగా పని చేయడానికి వచ్చే రత్తమ్మ అని గుర్తుపట్టాను.

పాములతో సాహసం చేసినట్లే రత్తమ్మ తన తాగుబోతు భర్తను ఎదిరించే సాహసం కూడా చేస్తే ఎంత బాగుండు!

తన భర్త తాగుబోతుతనాన్ని ఇంకా నేర్పుతున్న పరిస్థితులను ఎదిరించే సాహసం చేస్తే ఇంకెంత బాగుండు!

ఏదో పనిమీద మా ఊరెళ్ళినప్పుడు రత్తమ్మను కలిసి, కాసేపు పొగిడి, గెలుచుకున్న డబ్బేంచేశావని అడిగా...

"ఆ దొంగసచ్చినోడు తాగటానికి నన్ను కొట్టి తిట్టి లాక్కుని పోయాడు" అనంది.

సాహసం సేయవే ఢింబకీ...సొమ్ములు వచ్చునులే అని విచిత్రాతివిచిత్రంగా చెప్పే యాంకరమ్మాయి నన్ను చూసి తడబడుతున్నట్లుగా ఓ చిన్న ఊహ!

✤

లారీవాలా - గేటువాలా

రుక్మిణి



"జక్కులోడా?'' సోమిరెడ్డి గర్జనలాంటిది చేశాడు. అది ఆనందవెూ ఆవేశవెూ తెలువకపాయె. జక్కులోడు వురుక్కుంటూ వచ్చి స్టూలుమీద కూలబడ్డాడు.

"ఏంది బావా ఏమాయె అంత లావున అర్సినవ్! ఎవరేమన్నారే!" అన్నడు.

"జర వినుర... మానుకోట - వరంగల్ రోడ్డు పట్టిన... కొట్టేసిన ... అహ్హహ్హ" "వరంగల్‌గిన పోయినవ బావా" జక్కులోడు అమాయకంగా అడిగిండు.

"అహహ్హహ్హ (మరో అట్టహాసం) ఒరె. వరంగల్‌కు రోడ్డు... కట్టు -పుట్టు - నెట్టు... కాలం కలిసొస్తదిరా మూలన ముక్కుమూసుకుని కూకునే పార్టీకాదు మాది. పదేండ్లయినాసరే సీటు మీదెక్కినం. గీ పదేండ్ల లుక్సానును భర్తి చేసుకుంటం..!"

"అరె చుప్! గా రోడ్డు పాతబడిపోయింది. ఇహ గిపుడు కాజిపేట జంక్షన్ దనక కొత్త రోడ్డేయ్యాలె. కంట్రాక్టు మనకే వస్తంది".

జక్కులోడికి బుర్ర తిరిగింది. "మొన్న ఎలక్షన్ల దెబ్బకే అక్క నగల్తో సహ అంతా హారతాయే! బ్యాంకులో... ఇంట్లో పైసల్లేవాయె! మరి గీ రోడ్డెట్ల గడతరు!"

'ఒరె పని దొరికినంక పైసల బెంగొద్దు - మన దోస్తులు చాన మందున్నరు. దాన్ని బిట్ల కింద పగలేసి వాళ్ళతోనె కట్టిపిస్త. వాండ్లకు నిమ్మళంగ దబ్బులొస్తయి...!'

"అట్లనా... గనెట్ల?" జక్కులోడు పెద్దగా నోరు తెరిచి ఆవలించాడు.

"గదే మతలబు మజా! విను మరి! గవర్మెంటు కొత్తరోడ్లు కట్టడానికి రెడీ! అయితే దబ్బులు మాత్రం ఇవ్వదన్నమాట. కాంట్రాక్టర్లకు కాంట్రాక్టర్లు ఇంజనీర్లు నీళ్ళు నమలాలె! సరె... రోడ్లు పూర్తయినంక... అదే వాళ్ల దబ్బుల్తో పూర్తయినంక అది మన పూరా వడ్డీల వాండ్లకు వెసులుబాటు చేసే ప్లానుంది. అప్పటిదనక అది మనరోడ్దే. మనం కొనిపారేసినట్లు... మన సంపదే... హహ్హహ్హ... (అట్టహాసం)"

"రేపు మన బుజ్జమ్మపెళ్ళికి కట్నం కింద కూడా గా రోడ్డును వాళ్ళకి రాసిపారెయ్యొచ్చు గద".

సోమిరెడ్డి గుర్రుగా చూసిండు "పూరా వివరాలు వినకుండా గోల! వాళ్ళు పెట్టిన పెట్టుబడి పూర్తిగా దఖలయిందనక మనదే... పట్టు... అంతే ఆ రోడ్డు మీదొచ్చే దబ్బులన్నీ వసూళ్ళు చేసుకుంటమన్నమాట... అటెంక గవర్మెంటోళ్ళు అడిగితే వాండ్ల ఖాతాలోకి నెట్టేస్తాం...!"

జక్కులోడికి బుర్రంతా తిరిగిపోతుండగా సోమిరెడ్డిగారు ఆ రోడ్డుమీద నుండి పెట్టిన పెట్టుబడులు ప్లస్ వడ్డీలు ఎట్లెట్లా జనాలదగ్గరనుండి వసూలు చేసి గుంజుకోవాల్నో వివరిస్తున్నాడు. ముందు జక్కులోడికి చెవట్లు పోసినై! అటెంక ఇంత ఆనందమయింది. మొత్తం రోడ్డు... ఇటు మానుకోట... గూడూరు... నర్సంపేట... వరంగల్...హబ్బ ఏదో త్రీ-డీ సినిమా చూస్తున్నట్లు కండ్ల ముందర లగాయించి పరుగులు... రకరకాల సంఘటనలు కలగాపులగంగా కనబడసాగె... ఒక సంఘటన...

* * *

అది రోడ్డుమీద టోల్‌ట్యాక్సు వసూలు చేసే గేటు! ఏ వాహనం దానిమీద పోతే ఎంత చెల్లించాలో ఒక భారీ పట్టిక కూడా వేలాడదీశారు. కొన్ని నియమ నిబంధనలు కూడా రాశారు గానీ... అది ఎవడికీ అర్థంగాని ప్రాకృత భాషలో వుల్లేఖించారు.

"హల్ట్... హల్ట్"! ఎర్రజెండా... అడ్డంగా కట్టిన గేట్లు వున్నాయి. టోల్ టాక్సు గేటు కంట్రాక్టరు ఆవేశం పట్టలేక దబదబమని బల్లను బాదుతూ అరిచాడు. లారీ ఆగింది.

"ఇదే కదండి టోల్‌ట్యాక్సు సామీ... సొతంత్ర బారద్దేశంలో రోడ్డుమీద లారీ నదుపుకున్నా దబ్బులు కట్టాలె. బాగుంది... నంబడం... అరె... అసలెందుగ్గట్టాలె... ఎంత గట్టాలె! గా బోర్డులో ఏందీ... అరబీలోనో, అర్జెంటీనా భాషలోనో రాసిండ్రు. మరి గనెట్ల అర్థమయితది - నదుపుడెట్ల...?"

లారీ డ్రయివరు కం యజమానికి, టోలుటాక్సు బిల్ కలెక్టరు కం కంట్రాక్టరు పులకించిపోయాడు. పైన ధనాయించి ఎండ ... కనుచూపుమేరలో అటూ ఇటూ ఎట్లాటి వాహనాలూ... పిల్లలు కూడా కదలటం లేదు. టెంపరరీ గుడిసె,మంచినీళ్ళ కుండా, చెక్క బెంచీలున్నయి.

"దిగు... దిగు... నీళ్ళు తాగు... తొందరేం లేదు. నీ లారీలో ఏవుంది? బ్రేకులు సరిగ్గా వున్నయా... ఆగాగు... ఇట్లాంటి నీ సందేహాలకు నేను సమాధానం చెప్పకపోతే నీకే నష్టం!" అనడంతో 'నష్టం' అన్న పదం విని హడావుడిగా లారీలోని మనిషి దునికి గుడిసెలోకి దూరిపోయి, చెక్క బల్లమీద కూలబడ్డాడు.

"విను - ఈ రోడ్డు ప్రైవేటుగా కట్టుకొమ్మని గవర్మెంటార్డరు. గవర్మెంటు దబ్బు ఇవ్వదు. ఇంగ కట్టినోళ్ళం ఇట్లా టోల్‌టాక్సులు వసూలు చేసుకుంటన్నం"!

"అద్సరె... అట్లా ఎప్పటిదాంక భాయ్!" లారీ ఓనరు బిత్తరపోయి అడిగిండు.

(రహస్యంగా) "మా ఇష్టం... మా పెట్టుబడి పిలస్ మా వడ్డీ గవన్ని బూడిపోయిందనక... ఇంగిట్ల ఛార్జీలు వసూలు మా ఇష్టం! మా అవసరం! రసీదులు మా చిత్తం. ఈ రోడ్డు మీదపోదం... పోకపోదం మా ఇష్టం. ఎందుకంటే పాతరోడ్డును మూయించి పారనూకుతం గద!" బొళబొళమని గేటాయన నవ్వేశాడు.

"మరి గీ ఛార్జీల వివరాలేంది భాయ్!?"

"హహహ్హ... లారీలోడును బట్టి మా ట్యాక్సు... ఎనిమిది టన్నులయితే ఒక బిల్లు... దానికి పైనే అయితే మరింత ట్యాక్సు... ఎందుకంటే గవిలోడు పెరుగుతావుంటే రోడ్డును పూరా పాడుచేస్తయిగద... మరి ఆ రిపేర్లకు ఎవడియ్యాలె!

"ఆహా... అట్లనా? (సంబరంగా) మరి నాది లోడులేని ఖాళీ లారీ. రోడ్డు దీంతో పాడు గాదుగద..." అని లారీవాలా కూడా హహ్హహ్హ అని నవ్వబోయాడు. కాని టాక్సువాలా వెంటనే విలన్లా వికటంగా నవ్వాడు.

"గదే... అందుకే మీకీ మతలబులన్నీ అర్థంకాదని ఇవరం చెప్పేది. ఖాళీ లారీలకు అన్నిటికన్నా ఎక్కువ ట్యాక్సు. ఎందుకంటే అవి లోడు తొందరగ దొరకాల్ననీ... బరువులేదుకదా అనీ, యమాస్పీడుల దంచుకుపోతరు. పోయి దేన్నో గుద్దు గుద్ది పల్టీగొట్టి పదిమందిని చంపుతరుగద. రెండు మూడ్రోజులు రోడ్డు బ్లాకైతది గద... మరి వచ్చే పోయే బండ్లు రావు - రాకుంటే మాకు ఎంత నష్టం? వామ్మో... అందుకే ఖాళీ బండ్లకు అన్నిటికన్నా ఎక్కువ! సైకిళ్ళు... కార్లు... వాన్లు... మోటరు సైకిల్లు... వీటన్నిటికన్నా ఎక్కువ!"

లారీవాలా బెంచీమీద విరుచుకుపడి కండ్లు మిటకరిస్తున్నడు.

"ఇదుగో భాయ్! (రహస్యంగా) ముందు ముందు కాలినడక, ఎడ్లబండ్లను కూడా వదిలిపెట్టం! వాళ్ళనెత్తి మీద గడ్డిమోపో... పాలగంపో వుంటే మరింత ఎక్కువ వసూలు. చంకన చంటిబిడ్డున్నా సరే..."

లారీవాలా మిటుకు మిటుకు మని తెరిచినకండ్లు మూతబడ్డయి.

* * *

జక్కులోడు త్రీ-డి సిన్మానుండి ఒక్కసారే తెప్పరిల్లి స్టూలు మీద నుండి జారిపడ్డాడు!

మద్యపానం - మధుమేహం

మధుమేహం అదుపులో ఆహారం, వ్యాయామం, మందులతో పాటు జీవనశైలి, అలవాట్లు కూడా కీలకపాత్రనే పోషిస్తున్నాయి. ముఖ్యంగా ధూమపానం, మద్యపానం వంటి దురలవాట్లు బాధితులను మరిన్ని ఆరోగ్య సమస్యలకు గురిచేస్తాయి. అసలే మధుమేహం... ఆపై దురలవాట్లు... ఇక వారి ఆరోగ్యం గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. అయితే ఆ దురలవాట్లు దేహంపై ఎలాంటి దుష్ఫలితాలను కలుగచేస్తాయో తెలిపే ప్రయత్నమే ఈ వ్యాసం.

డా॥యం. శ్రీనివాసరావు.

మద్యపానం వల్ల మనిషికి అన్నీ నష్టాలే. డబ్బు, ఆరోగ్యమే కాదు సర్వస్వం కోల్పోవడం జరుగుతుంది. సమాజంలో గౌరవం కూడా పోతుంది. ప్రభుత్వం ఒకసారి నిషేధం విధించినా... ఆ నిషేధాన్ని మళ్ళీ వెనక్కు తీసుకోవడంలోనే మనిషిలోని బలహీనతలు ఎంత బలంగా వుంటాయో అర్థమవుతోంది.

ప్రస్తుత మన విషయానికి వస్తే... ఆల్కహాల్ మానవ దేహానికి కొంత వరకు శక్తిని యిస్తుంది. కాని పోషక విలువలు (న్యూట్రిషనల్ వ్యాల్యూస్) వుండవు. శక్తినే కేలరీస్‌లో పేర్కొంటారు. ఈ కేలరీస్ కూడా ఒక్కో రకం ఆల్కహాల్‌కు ఒక్కొక్క రకంగా వుంటాయి. ఉదాహరణకు 30మి.లీ. జిన్ లేదా రమ్ 80 కేలరీలు, 650 మి.లీ. బీర్‌లో 400 కేలరీలు, 100 మి.లీ. వైన్‌లో 130 కేలరీలు వుంటాయి.

ఆల్కహాల్‌లో విటమిన్‌లు, ప్రొటీన్‌లు, క్రొవ్వుపదార్థాలు, మినరల్స్ వంటివి ఏమీ వుండవు. ఆల్కహాల్ తీసుకుంటే స్థూలకాయులుగా తయారవుతారు. స్థూలకాయం మధుమేహానికి బద్ధ శత్రువు అని ప్రత్యేకించి చెప్పనక్కరలేదు.

మధుమేహం సహజంగానే నరాల సంబంధ న్యూరోపతికి కారణమవుతుంది. దానికి తోడు ఆల్కహాల్ తీసుకుంటే సమస్య వేగవంతమవుతుంది. త్వరితగతిన న్యూరోపతికి గురి అవుతారు. మధుమేహం కంట్రోల్‌లో లేనివారు మద్యపానం వల్ల తీవ్ర న్యూరైటిస్‌కు గురి అవుతారు. తర్వాత మధుమేహాన్ని అదుపులోకి తెచ్చినా న్యూరైటిస్‌లో మెరుగుదల వుండదు. మధుమేహం మందులు వాడే వారిలో ముఖ్యంగా కోర్ ప్రొపమైడో మందువాడే వారిలో ఆల్కహాల్ తీసుకుంటే ముఖం వాపు వస్తుంది.

దీర్ఘకాలం మద్యపానం అలవాటు గలవారిలో కాలేయం (లివర్) పనితీరులో అనేక అసాధారణ మార్పులు వస్తాయి. మధుమేహానికి సంబంధించినంత వరకు లివర్‌లో గ్లైకోజన్ స్థాయి తగ్గిపోతుంది. పోషకాహారం తీసుకోని వారిలో ఈ సమస్య ఎక్కువగా తలెత్తుతుంది. మధుమేహ మందులు వాడుతున్నప్పుడు రక్తంలో సుగర్ శాతం తగ్గుతుంది. లివర్‌లో తగిన గ్లైకోజన్ స్టోరేజి లేనందు వల్ల దీర్ఘకాల హైపోగ్లైసీమియాకు గురి అవుతారు. వీరికి గ్లూకోజు యిచ్చినా వెంటనే రికవరీ వుండదు. చాలా సమయం పడుతుంది. కార్బోహైడ్రేటేతర పదార్థాల నుంచి గ్లూకోజ్ ఉత్పత్తి అవుతుంది. దీనినే గ్లూకోనియోజెనిసిస్ అంటారు. మద్యపానం అలవాటు గలవారిలో ఈ ప్రక్రియకు అంతరాయం ఏర్పడుతుంది.

మద్యపానం లిపిడ్ ప్రొఫైల్ (క్రొవ్వు పదార్థం)పై ప్రభావం చూపుతుంది. మామూలుగా మధుమేహ వ్యాధే క్రొవ్వు పదార్థాలలో అసాధారణ మార్పులకు దారితీస్తుంది. మద్యపానం అలవాటు ఉంటే ఆ ప్రభావం మరింత పెరుగుతుంది. లిపిడ్ ప్రొఫైల్‌లో బ్యాడ్ కొలెస్ట్రాల్‌గా భావించే వి.ఎల్.డి.ఎల్. ట్రైగ్లిజరైడ్స్, రక్తంలో బాగా పెరిగిపోతాయి. ఫలితంగా గుండెకు రక్తాన్ని సరఫరాచేసే కరోనరీ రక్తనాళాలలో రిస్క్ అనేక రెట్లు ఎక్కువవుతుంది. చివరకు హార్ట్‌ఎటాక్‌కు, కార్డియో మయోపతికి దారితీస్తుంది. మద్యపానం ఎసిడోసిస్‌కు దారితీస్తుంది. ఫెన్‌ఫార్మిన్ మందు తీసుకునే వారిలో దీని ప్రభావం చాలా ఎక్కువగా వుంటుంది. అయితే ఇటీవలనే ప్రభుత్వం మన దేశంలో ఫెన్‌ఫార్మిన్‌ను నిషేధించింది.

మద్యపానం క్రానిక్ పాంక్రియాటైటిస్‌కు దారితీస్తుంది. మధుమేహం- మద్యపానం రెండూ తోడయితే ఇక వారికి వచ్చే ఆరోగ్య సమస్యలు, ఆర్థిక నష్టాలు అన్నీ ఇన్నీ కావు. మద్యపానం వంటి దుర్వ్యసనానికి అలవాటు పడకుండా ఉండడం మంచిది. ఈ మధ్యన కొందరు కొద్దిగా ఆల్కహాల్ తీసుకుంటే ఆరోగ్యం అని వినిపిస్తున్నారు. అలవాటున్నవారు సమర్థించుకునేందుకు చెప్పేమాటలే గాని, మన దేశంలాంటి ఉష్ణమండల దేశాలలో ఆల్కహాల్ అవసరం ఎంతమాత్రం లేదు. అసలు ఆల్కహాల్‌కు ఎంతదూరంగా ఉంటే ఆరోగ్యానికి, ఆర్థికంగా కుటుంబానికి అంతమంచిది. ✤



హెచ్.ఐ.వి. పాజిటివ్ అయిన వారికి ఏఏ పరీక్షలు అవసరం?



ప్రాథమికంగా ఒక వ్యక్తిలో హెచ్.ఐ.వి. వుందా? లేదా? అని తెలుసుకునేందుకు అనేక 'స్పాట్' పద్ధతులు అందుబాటులో వున్నాయి. ఈ 'స్పాట్' పద్ధతులలో కూడా 'ట్రైడాట్' పద్ధతి అత్యంత ప్రాచుర్యం పొందింది. ఈ పద్ధతుల్లో పరీక్ష అత్యంత సెన్సిటివ్‌గా వుంటుంది. అయితే అంత స్పెసిఫిసిటి మాత్రం వుండదు. అందువల్లనే ఈ పరీక్షలను స్క్రీనింగ్ పరీక్షలకు ఉపయోగించుకోవడం జరుగుతోంది.

హెచ్.ఐ.వి. శరీరంలో వుందో లేదో నిర్ధారించుకునేందుకు కేవలం ఒక్క స్పాట్ పరీక్ష మాత్రమే చాలదు. అందువల్లనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలలో వివిధ రకాలైన కిట్‌లతో మూడు పద్ధతులలో



పరీక్షించినతర్వాతే హెచ్.ఐ.వి. ఉన్నది, లేనిది రిపోర్టు యివ్వడం జరుగుతుంది. అయితే బయట ప్రయివేటు లేబొరేటరీలలో కేవలం ఒక్క పరీక్ష మాత్రమే చేసి రిపోర్టు యివ్వడం జరుగుతుంది. పరీక్ష పాజిటివ్ అయితే ఆ రిపోర్టుతోపాటు "ఇది కేవలం స్క్రీనింగ్ పరీక్ష మాత్రమే. నిర్ధారణకు వెస్టన్ బ్లిట్ పరీక్ష లేదా పి.సి.ఆర్ పరీక్ష లేదా ఎలీసా పరీక్ష చేయించుకోమని" ఎడ్వైజ్ చేయడం జరుగుతోంది.

హెచ్.ఐ.వి. వంటి వ్యాధులలో పాజిటివ్ ఫలితాన్ని జీర్ణించుకోవడం అంత తేలికైన విషయం కాదు. దానికి తోడు చేసే పద్ధతి కూడా కచ్చితమైనది కాదని చెప్పడంతో ఆ వ్యక్తులు సహజంగానే ఇతర నిర్ధారణ పరీక్షలకు వెళ్ళడం జరుగుతోంది. అయితే ఆ పరీక్షలన్నీ ఖరీదైనవి. అంతేకాక వెంటనే వెస్టన్ బ్లాట్ వంటి పరీక్ష చేయించితే వైరస్ శరీరంలో వున్న ఫలితం నెగిటివ్‌గా రావచ్చును. మూడు వారాల తర్వాతే పి.సి.ఆర్. పరీక్ష కూడా చేయించడం మంచిదని వైద్య నిపుణులు సలహాలిస్తున్నారు.

కనుక ఈ పరిస్థితులలో ఆ పరీక్షల అవసరం అంతగా లేదు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించు కుని పరీక్ష చేయించుకుంటే సరిపోతుంది.

వ్యాధి నిర్ధారణకు తప్ప వెస్టన్‌బ్లాట్ పి.సి.ఆర్. పరీక్షలు పనికిరావు. ఆ నిర్ధారణకు అంత ఖరీదైన పరీక్షలే అవసరంలేదు. మరోముఖ్య విషయం భార్యాభర్తలిద్దరికీ స్పాట్ మెథడ్‌లో పాజిటివ్ వస్తే... వాళ్ళిద్దరికీ మళ్ళీ వెస్టన్ బ్లాట్ పరీక్ష అవసరంలేదు. ఒకరిలో వెస్టన్ బ్లాట్ పి.సి.ఆర్ పాజిటివ్ వస్తే భార్యాభర్తలలో రెండో వారిలో వుందనే నిర్ధారణ అయినట్టే. ఇద్దరికీ వెస్టన్ బ్లాట్, పి.సి. ఆర్ పరీక్షలు అవసరం లేదు.

స్పాట్ పద్ధతులలో నిర్ధారించుకున్నాక, వ్యక్తులలో వ్యాధి లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నా... ఎక్స్పోజర్ హిస్టరీ క్లియర్ వున్నా... నిర్ధారణ పరీక్షలు చేయడం అనవసరం.

వీరికి సి.డి.-4, సి.డి. -8 కౌంట్ పరీక్ష లేదా వైరల్‌లోడ్ పరీక్షలు చేస్తే కొంత ఉపయోగకరంగా వుంటుంది. శరీరంలో సి.డి.-4, సి.డి.-8 అకౌంట్‌ను బట్టి రోగనిరోధక శక్తి స్థాయిని అంచనా వేయవచ్చును. హెచ్.ఐ.వి.కి వాడే మందులను, సి.డి.-4, సి.డి.-8 కౌంట్ ఆధారంగానే వాడడం జరుగుతోంది.

అలానే, వైరల్ లోడ్ పరీక్షను చేయించడం ద్వారా ఒక మి.లీ. రక్తంలో ఎన్ని వైరస్‌లు వున్నాయో తెలుస్తుంది. దాని వల్ల వ్యాధి తీవ్రతను అంచనా వేయవచ్చును. మందులు వాడవలసిన అవసరాన్ని గుర్తించవచ్చును. మందులు వాడుతుంటే వైరస్‌లోడ్ పెరుగుతున్నదీ, తగ్గుతున్నదీ, మందులు పని చేస్తున్న తీరును అంచనా వేయవచ్చును. అలానే సి.డి.-4, సి.డి.-8 కౌంట్ ద్వారా కూడా రోగి భవిష్యత్ ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయవచ్చును. అంతేగాని పాజిటివ్ వ్యక్తులకు వెస్టన్ బ్లాట్, పి.సి.ఆర్. పరీక్షలు అవసరం లేదు. సమయానుకూల వ్యాధులకు యితర రక్త, మూత్ర, పరీక్షలు తప్పవు. ఆర్థిక వెసులుబాటు ఉంటే హెచ్.ఐ.వి. సి.డి.-4, సి.డి.-8 చేయించుకోగలిగితే మంచిది. వైరల్‌లోడ్ చేయించుకోగలిగితే యింకా మంచిది. అయితే అంత ఖరీదైన పరీక్షలను వారు చేయించుకోగలరా అన్నది ఆలోచించి వైద్యులు పరీక్షలు రాయాలి. అనవసరంగా పరీక్షల గురించి పేదవారిని మానసిక వ్యాధికి గురిచేయకూడదు. నకిలీ వైద్యులను హెచ్.ఐ.వి. అనుమానితులు ఆశ్రయించకూడదు. వీరి వల్ల ఇల్లు, ఒళ్ళు గుల్లకావడం తప్ప ఒరిగేదేమీలేదు.



పుస్తక పరిచయం

విప్లవ దాహం



చేగువేరారచనలు

ప్రచురణ:

ప్రజాశక్తి బుక్‌హౌస్

హైదరాబాద్-20.

పేజీలు:144,

వెల:రూ. 80/-

ప్రతులకు:

ప్రజాశక్తి

అతడు పుట్టిందొక చోట... పెరిగింది మరో చోట... బతుకు బాధలు చూసింది ఇంకో చోట... పలు దేశాలలో విప్లవోద్యమాలను విజయపథాన నడిపించి అమరుడైనది మరో విప్లవ పురిటిగడ్డపైన... ప్రపంచ విప్లవకారులలో ఒక అరుదైన వ్యక్తి అజరామర వ్యక్తిత్వం సొంతమైన విప్లవకారుడు. విప్లవం అతని దాహం. విప్లవోద్యమం అతని జీవితం. ఆ ఉద్యమ విజయం అతని లక్ష్యం. అందుకే ఒక ప్రాంతంలో విప్లవోద్యమం విజయవంతమైనా అక్కడితో ఆగకుండా మరో దేశానికి వెళ్లి అక్కడి విప్లవోద్యమానికి నాయకత్వం వహించాడు. వాస్తవానికి ఇంతటి ఉపోద్ఘాతం అతనికి కూడనిది.. ఆ వ్యక్తి చేగువేరా. అతనొక అంతర్జాతీయవాది మాత్రమే కాదు...అంతర్జాతీయ విప్లవకారుడు. విప్లవ కార్యాచరణకు పదహారణాల ఉదాహరణ అతడు. నిలువెత్తు ఉత్తేజపూరిత ఉదాహరణ అతడు. ఈనాటికీ చైతన్య విస్ఫోటనమైన చే రాసిన రచనల పుస్తకం ఈ "చేగువేరా రచనలు".

చదివింది డాక్టరైనా ఒకానొక కీలక క్షణాన తను మోయాల్సింది మందుల బస్తానా లేక మందుగుండు సామగ్రి ఉన్న పెట్టెనా అన్న సందిగ్ధంలో పడ్డాడు. మందులు వదిలి మందుగుండు చేబూనాడు. శరీరం నెత్తురోడుతున్నా శత్రు విమానాలపై తుపాకీ ఎక్కుపెట్టిన ధీశాలి చేగువేరా. అంతటి విప్లవఖని రాసిన అనుభవాల విశ్లేషణల గ్రంథం ఈ పుస్తకం.

1967 అక్టోబర్ 18న పది లక్షలమందికి పైగా హాజరైన చే సంస్మరణ సభలో ఆయన సహచరుడు, క్యూబా అధ్యక్షుడు ఫైడల్ కాస్ట్రో, చే గొప్ప సేనాని అని, లక్ష్యశుద్ధి, దూరదృష్టి, విశాలమైన సభ్యత, ఆలోచించే తత్వం...ఇలా అన్ని మంచి లక్షణాలు ఒకే వ్యక్తిలో కలిసిఉన్న ఉత్తమ విప్లవకారుడని అన్న మాటలు అక్షరసత్యాలు. భావి విప్లవకారులకు దిశానిర్దేశాలు.

విప్లవం-రాజకీయాల మధ్య సంబంధాలపై వెలుబడిన "చేగువేరా రచనలు" మూడు భాగాలుగా ఉంది. 22 ఆయుధాలు, కొద్దిపాటి మందుగుండు సామగ్రి, కాస్త ఆహారంతో గ్రాన్మా అనే ఓ చిన్న పడవలో క్యూబాకు బయల్దేరినది మొదలు బాటిస్టా ప్రభుత్వాన్ని గజగజలాడించి కూల్చివేసే స్థాయికి విప్లవ పోరాటాన్ని విస్తరింపచేసిన తీరును చే పేర్కొన్నాడీ రచనలో. యుద్ధ ఖైదీల పట్ల సోషలిస్టు విప్లవకారుల ధోరణి ఎంత మానవీయ హృదయ స్పందనతో ఉంటుందనేందుకు కూడా క్యూబా విప్లవం ఓ ఉదాహరణ. పోరాట సమయంలో తమకు దొరికిన శత్రు సైనికుల పట్ల వ్యవహరించిన ధోరణిని చే ప్రస్తావిస్తాడు. "గాయపడిన వారి పట్ల మేం అనుసరించిన వైఖరి బాటిస్టా సైనికుల వైఖరి కంటే భిన్నమైంది. గాయపడిన మా మనుషులను వారు చంపడమే కాకుండా వాళ్లను వాళ్ల కర్మకు వదిలేశారు. కానీ మాకు పట్టుబడ్డ శత్రు సైనికులకు మంచి ఆహారం, వైద్యం అందజేయమని ఫైడల్ ఆదేశించాడు" అని చే రాస్తాడు. ఒక తీవ్రస్థాయి ఉద్యమంలో ఆగ్రహావేశాలు కూడా వ్యక్తం అవుతుంటాయి. విమర్శలను తట్టుకోలేని వారు విప్లవోద్యమానికి ద్రోహం చేస్తారు. విమర్శలను స్ఫూర్తిగా తీసుకునేవారు ఉద్యమాన్ని మరింత ముందుకు నడిపిస్తారు. అలాంటి ఒక స్ఫూర్తిదాయక సంఘటనను ఈ పుస్తకంలో చే ప్రస్తావించాడు. "ఒక సైనికుడు యుద్ధం జరుగుతుండగా నిద్రపోతూ కనిపించాడు. నేను అతన్ని లేపి తిట్టాను. తన తుపాకీని ప్రమాదవశాత్తూ పోగొట్టుకున్నానని చెప్పాడు. నాకు అలవాటైన పొడిగొంతుతో 'అయితే వట్టి చేతులతో వెళ్లి ఆయుధం సంపాదించుకో' అని మామూలుగా అనేశాను. ఆ తరువాత శాంతాక్లారా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తుండగా చావుకు సిద్ధంగా ఉన్న ఒక మనిషి నా చేయిని స్పృశించాడు. 'మీకు గుర్తుందా కమాండర్? రెమిడియాస్‌లో ఆయుధాన్ని వెతుక్కోమని నన్ను పంపించారు. దాన్ని నేను ఇక్కడ (శాంతా క్లారా పోరాటంలో) సంపాదించుకో గలిగాను' అని చెప్పాడు. ఆ తర్వాత కొద్ది నిమిషాలకు అతడు చనిపోయాడు. మా విప్లవ సైన్యం స్ఫూర్తి అటువంటిది."

"సోషలిస్ట్ సమాజం తొలి దశ" పేరిట ఉన్న రెండవ భాగంలో వివిధ సందర్భాల్లో చే రచనలు, ఉపన్యాసాలు ఉన్నాయి. గెరిల్లా యుద్ధం అంటే ఏమిటి? దాని ఉద్దేశాలు, విధానాలపై వివరణాత్మకంగా అవి ఉన్నాయి. సాయుధ పోరాటం మీద కూడా చాలా విస్పష్టమైన అభిప్రాయాలను చే వెల్లడించాడు.

కేవలం యుద్ధ తంత్రాలే కాకుండా ఆర్థిక సంబంధమైన విషయాల్లోనూ చే దిట్ట. ఆ విషయం ఒక దేశ సార్వభౌమాధికారం గురించి ఆయన చేసిన ప్రస్తావనలను గమనిస్తే అర్థం అవుతుంది. ".....ఆర్థిక స్వాతంత్ర్యం, రాజకీయ సార్వభౌమాధికారం ఒకదానికి ఒకటి ముడిపడి ఉన్నాయి. ఒక దేశం తన ఆర్థిక విధానాలను స్వయంగా నిర్దేశించలేనప్పుడు అది సార్వభౌమాధికార దేశంగా పిలువ జాలదు....." సార్వభౌమాధికారం గురించి చే అప్పట్లో చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పటి ప్రపంచానికీ వర్తిస్తాయి. అనేక దేశాలు అమెరికా, దాని పెత్తందారీతనం కింద నడుస్తున్న ఆర్థిక సంస్థల ఆదేశిత ఆర్థిక విధానాలు అమలుచేస్తున్న అన్ని దేశాలకూ ఈ వ్యాఖ్యలు వర్తిస్తాయి. ప్రభుత్వ విభాగాలే కాకుండా ఆర్థిక విభాగాలు కూడా ప్రజల చేతుల్లో ఉండాలనేది చే వాదన. క్యూబాలో దాన్ని అనుసరించి చూపించారు.

పార్టీ నిర్మాణ అంశాలపై కూడా ఆయన విశిష్టమైన అభిప్రాయాలు చే రచనల్లో కనిపిస్తాయి. విప్లవ లక్ష్య సాధనలో అవసరమైతే ప్రాణత్యాగానికి సైతం కార్యకర్త సిద్ధంగా ఉండాలని చెప్పడమే కాకుండా అదే మార్గంలో పయనించి అమరుడయ్యాడు చే గువేరా.

తన చిన్నారులకు సైతం లేఖల ద్వారా విప్లవ పోరాటాలు నేర్పాడు చే. ఆ లేఖలు ఈ పుస్తకంలో మూడవభాగంగా వున్నాయి. చిన్నప్పటి నుంచే వారికి విప్లవ స్ఫూర్తి కలిగించాడు.

చే రచనలు పరిశీలిస్తే అతడికి విప్లవం పట్లనే కాకుండా సాహిత్య, రచనావ్యాసంగంలో సైతం ఎంత పట్టు ఉందో అర్థం అవుతుంది. విప్లవ వ్యూహాలు రూపొందించడమే కాదు.... వాటిని వివరణాత్మకంగా వర్ణించడమూ క్లిష్టమే. చే రచనలను గమనిస్తే ఆ రెండు పనులను చాలా సులభంగా చేశాడనిపిస్తుంది. వైద్యుడై ఉండి సామాజిక రుగ్మతలకు శస్త్ర చికిత్స చేసేందుకు ఆయుధం చేబూనిన చే క్యూబా విప్లవ చరిత్ర, అందులో తన భాగం, నూతన సమాజ నిర్మాణం వంటి అంశాలపై తన అనుభవాలను, ఆయన మాటల్లోనే చదువుకునేందుకు ఒక అమూల్య అవకాశం ఈ పుస్తకం. చాలా కాలం వరకూ చే రచనలు లాటిన్ భాషలో తప్పించి మరో భాషలో అందుబాటులో లేవు. మన దేశంలో లెఫ్ట్‌వర్డ్ ఆ కొరతను తీర్చింది. ప్రజాశక్తి బుక్‌హౌస్ తన బాధ్యతను నెరవేర్చింది. చే అభిమానులు ఆనందంలో మునిగారు.

-'తాజ్'

స్వీకారం



చరిత్రను కథలాగా చెప్పే వరవడి పెట్టిన ప్రపంచ ప్రసిద్ధ గ్రంథం ఫ్రీడం ఎట్ మిడ్‌నైట్. బ్రిటిష్ పాలన తుదిఘట్టంలో సాగిన చారిత్రాత్మక పరిణామాలను కళ్ళకు కడుతుంది. దేశవిభజన, మత కలహాలు, మహాత్ముని దారుణహత్య అన్నీ డాక్యుమెంటరీలా మీ ముందుంచుతుంది.

రచయిత: లేరీ కాలిన్స్, డొమినిక్ లాపిరే

సంక్షిప్తానువాదం: రావెల సాంబశివరావు

వెల: రూ. 25/-

ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్, అన్ని బ్రాంచీలు

రచయిత: పరకాల పట్టాభి రామారావు

వెల: రూ. 50/-

ప్రతులకు: విశాలాంధ్ర బుక్‌హౌస్, అన్ని బ్రాంచీలు

కొత్త సొగసుల

తారామతి బారాదరి



నాలుగు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగర మణిమకుటాల్లో కలికితురాయి ఈ తారామతి బారాదరి.

వల్లభనేని సురేష్

అద్భుత చారిత్రక కట్టడమిది. అప్పటి నిజాం రాజుల పాలనాదక్షతకు, కళాపోషణకు నిలువెత్తు సాక్షిగా నిలిచిన సంగీత నృత్యశాల తారామతి బారాదరి. ఈ నృత్యశాల నుంచి తారామతి ఆలపించే చక్కని సంగీతాన్ని అప్పటి నిజాం నవాబు గోల్కొండ కోటపై హిమాయత్‌సాగర్ నుండి వచ్చే చల్లని గాలితెమ్మెరల మధ్య కూర్చుని ఆస్వాదించేవారు. అంతటి గొప్ప చరిత్ర కలిగిన తారామతి బారాదరి ఇటీవలే 'గోల్కొండ సంగీత ఉత్సవాలు' జరుపుకుంది. కోటకు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నా అక్కడ పాడే శ్రావ్యమైన గీతాలు కోటలోకి వినిపించే విధంగా బారాదరిని రూపొందించారంటే అప్పటి నవాబులు ఎంతటి సంగీతప్రియులో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. అంతటి గొప్ప చరిత్ర కలిగిన బారాదరి చరిత్రలోకి వెళితే...

నిజాం పాలకుల్లో ఒకరైన అబ్దుల్లా కుతుబ్‌షా 1626 నుండి 1676 వరకు అంటే సుమారు యాభై సంవత్సరాల కాలం గోల్కొండ చక్రవర్తిగా ఉన్నాడు. తాత కులీకుతుబ్‌షా లాగే ఇతనూ కళలను పోషించాడు. కులమతాలకు అతీతంగా కళాకారులను ఆదరించాడు. ఆ క్రమంలో భాగంగానే అద్భుత సంగీత, నృత్యకారులైన కవలలు తారామతి, ప్రేమామతిలను ఆదరించాడు. వీరికోసమే పర్షియన్ ఆర్కిటెక్చర్ల సహకారంతో గోల్కొండకు సమీపంలో కోటలో వాడిన అద్భుత శ్రవణ విధానాన్నే ఉపయోగించి రెండు మండపాలు నిర్మించాడు. వాటికి తారామతి బారాదరి, ప్రేమామతి బారాదరి అని నామకరణం చేశారు(బారాదరి అంటే మండపం). ఈ రెండు మండపాలు ఇప్పటికీ చెక్కు చెదరకుండా అప్పటి కట్టడ కళా నైపుణ్యానికి ప్రతీకలుగా నిలిచాయి.



ప్రస్తుతం ఎపి టూరిజం శాఖవారు ఈ తారామతి బారాదరినే అభివృద్ధి చేశారు. ప్రేమామతి బారాదరికి సంబంధించిన స్థలం కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉండటంతో దానిని అలాగే ఉంచారు. తారామతి బారాదరి మాత్రం పన్నెండు గుమ్మటాలతో ఎటు చూసినా ఒకే విధంగా ఉంటుంది. నిజాం పాలన అంతరించినప్పటి నుంచి చెట్ల మధ్య పాడుబడిన కట్టడంలా ఉన్న బారాదరిని పర్యాటక శాఖ గుర్తించింది. అభివృద్ధి కోసం సుమారు ఆరు కోట్ల రూపాయలను కేటాయించింది. 16 నెలల కాలంలో నాలుగు వందల సంవత్సరాల కాలాన్ని గుర్తుతెచ్చేలా దీన్ని రూపొందించారు. దీని సమీపంలోనే హిమాయత్‌సాగర్‌కు వెళ్లే రోడ్డు ఉంటుంది. మూడు అంతస్తులను పోలి ఉండే విధంగా ఒక గుట్టపై దీనిని ఏర్పాటుచేశారు. పైకి వెళ్లటానికి మాత్రం ఒకే వరుసలో మెట్లను ఏర్పాటు చేశారు. దీనిని చూడటానికి వచ్చేవారికి వినోదాన్ని అందించేందుకు 1500 మంది పట్టే విధంగా ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం కూడా ఏర్పాటు చేశారు. ఇవే కాకుండా ఐదు వందలమందికి సరిపోయే విధంగా ఎయిర్ కూలింగ్ థియేటర్‌ను నిర్మించారు. ఇక్కడే సమావేశాలు, ఎగ్జిబిషన్లు జరుపుకోవడానికి ప్రత్యేకంగా బెంక్వేట్ హాల్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఒకే సమయంలో 250 మంది కూర్చొని విందు ఆరగించవచ్చు. అనేక ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఏర్పాటు చేసే పున్నమీ మల్టీ క్యూసైన్ రెస్టారెంటును, 50 సీట్లతో సాఖీ అనే ఎయిర్ కూలింగ్‌బార్‌ను ఏర్పాటుచేశారు. విదేశీ టూరిస్టులకు విడిది కల్పించేదుకు 26 ఎసి డబుల్ బెడ్‌రూములు, ఆరు ఎసి సూట్ కాంప్లెక్సులు నిర్మించారు. నగరానికి వచ్చే పర్యాటకులకు గోల్కొండ కోటలో రాత్రి సమయంలో లైట్ అండ్ మ్యూజిక్ షో చూపించి తారామతి బారాదరిలో విడిది కల్పిస్తారు. అయితే ఇటీవల కాలంలో దీనిని మరింత అభివృద్ధి చేసే ఉద్దేశంతో పర్యాటక శాఖ ఉత్సవాలు నిర్వహించింది. ఈ ఉత్సవాల్లో దేశంలోనే ప్రఖ్యాతి గాంచిన అనేకమంది కళాకారులు పాల్గొన్నారు. వారిలో ప్రముఖ నర్తకి, ఒకప్పటి హిందీసినీ హీరోయిన్ హేమమాలిని నృత్యప్రదర్శన జరిగింది. రెండో రోజు హైదరాబాద్ బ్రదర్స్‌గా ప్రసిద్ధి చెందిన రాఘవాచారి, శేషాచారి భక్త రామదాసు కీర్తనలు ఏర్పాటు చేశారు. ఉస్తాద్ ఆషీష్‌ఖాన్ సరోద్, సుధీర్‌ఫడ్‌కే సితార్, రిషి రంజన్ రబాబ్, ఆనిందో ఛటర్జీ తబలా సంగీతం వినిపించారు. ఏది ఏమైనా గోల్కొండ కోట కళలకు కాణాచి. ఇక్కడ సాహిత్య-సంగీత-నృత్యాలు ప్రభువుల ఆదరణ పొందాయనడంలో మాత్రం సందేహం లేదు.

ఇది మన రాష్ట్ర రాజధానే కాబట్టి అనేక విధాలుగా హైదరాబాద్‌కు చేరే రైలు, రోడ్డు, విమాన మార్గాలున్నాయి. సిటీకి చేరాక ఈ తారామతీ బారాదరీకి చేరేందుకు కూడా ఎపి టూరిజం వారు ఏర్పాటుచేసిన ప్రత్యేక బస్సులున్నాయి. సెంట్రల్ బస్‌స్టేషన్ నుండి, హైదరాబాద్, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ల నుంచి గోల్కొండకు చేరేందుకు సిటీబస్, ఆటో సౌకర్యాలున్నాయి. అద్దెకు దొరికే సిటీక్యాబ్‌లనే టాక్సీలు కూడా దొరుకుతాయి. బేగంపేట్ విమానాశ్రయం నుంచి కూడా ఈ తారామతి బారాదరికి చేరేందుకు అనేక సౌకర్యాలున్నాయి. ✤



గోల్కొండ సంగీతోత్సవం



అనుపమాన విలన్ అమ్రీష్‌పురి

హెచ్. రమేష్‌బాబు

1932 జూన్ 22న జలంధర్ తాలూకాలోని నవన్ షెహర్‌లో పుట్టిన అమ్రీష్‌పురికి నలుగురు అన్నదమ్ములు. రెండో అన్న మదన్‌పురి సినీనటుడే. ఢిల్లీ, సిమ్లాల్లో అమ్రీష్‌పురి విద్యాభ్యాసం సాగింది. సిమ్లా బి.ఎం. కాలేజీలో డిగ్రీ పొందాడు. అమ్రీష్‌పురి సినీనటుడు కావడం ఇంట్లో ఎవరికీ ఇష్టంలేదు. అన్న మదన్‌పురి సినిమాల్లోకి వెళ్లినపుడు అందరూ తిట్టారు. కానీ అతను పేరున్న నటుడైనాడు. పెద్దన్న చమన్ కూడా సినీనటుడైనాడు. వీరిద్దరూ సినిమాల్లోకి రావడానికి కారణం వీరికి కజిన్ అయ్యే కె.ఎల్.సైగల్ ప్రేరణనే విషయం చాలామందికి తెలియదు. దీంతో మూడవ తరం నుండి అమ్రీష్‌పురి కూడా సినిమాల్లో నటించేందుకు ప్రయత్నాలు ప్రారంభించాడు. మదన్‌పురి తమ్ముడనే అర్హత కూడా అవకాశాలు తెచ్చిపెట్టలేదు. హీరో పాత్రకావాలని ఓ నిర్మాత నడిగితే నీ ముఖం విలన్‌పాత్రలకే సరిపోతుందని తిప్పిపంపాడు. చిన్న చిన్న అవకాశాలు వచ్చి వాటిని మదన్‌పురి సలహా మేరకు వాటిని ఒప్పుకోలేదు. కానీ జీవిక సాగించడానికి ఎల్.ఐ.సి.లో పనిచేసాడు అమ్రిష్.

సినిమావేషాలకోసం ప్రయత్నిస్తూనే నాటకరంగంలో కృషి చేస్తున్న ఇబ్రహీం అల్కాజీ నాట్య సంఘంలో చేరాడు. ఇక్కడే నటనలో చాలా విషయాలు తెలుసుకున్నాడాయన. సత్యదేవ్‌దుబే ఇక్కడ ఓ అధ్యాపకుడు. ఈయన దర్శక నిర్మాతగా ప్రదర్శితమైన "అంధాయుగ్" నాటకంలో ధృతరాష్ట్రపాత్ర పోషించాడు అమ్రీష్. ఈ పాత్ర పోషణకు ఆయనకు బొంబాయిలో మంచి పేరు వచ్చింది. ఈ నాటకానికి సంబంధించిన రివ్యూలను పత్రికల్లో చదివిన గిరీష్‌కర్నాడ్ "కాడు" చిత్రంలో నటించేందుకు అమ్రీష్‌పురిని ఎంపిక చేశాడు. అంతకుముందు సునీల్‌దత్ తీసిన రేష్మా ఔర్ షేరా"లోని పాత్ర ఈయనకి బ్రేక్‌నిచ్చింది.

ఆ వెంటనే న్యూవేవ్ సినిమాలైన 'నిషాంత్', 'మంథన్', 'ఆక్రోష్', భూమిక' చిత్రాల్లో నటనా ప్రతిభను నిరూపించుకునే పాత్రలు పోషించాడు అమ్రీష్. అయితే ఆయనకు కమర్షియల్ సినిమా బ్రేక్ వచ్చింది మాత్రం ఫిరోజ్‌ఖాన్ "ఖుర్బాని".

తెలుగుచిత్రసీమను 80,90 దశకాల్లో సత్యనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, రావుగోపాలరావు ప్రతినాయక పాత్రలకు పెట్టిందిపేరుగా ఏలారు. వీళ్ళ విలనీలో అంతర్లీనంగా కామెడీ టచ్ ఉండటం సర్వసామాన్యమైన తరుణంలో ఉత్తరభారతం నుండి ఒక విలక్షణ నటుడు విలన్‌గా తెలుగుప్రేక్షకులకు సరికొత్త నటనను చూపారు. అదేదో విలన్ అంటే భయంకరంగా ఉంటే చాలన్నట్లుగా గాక అబినయానికి దగ్గ వాచకాన్ని సొంతం చేసుకున్నవాడతను. పరభాషారంగానికి వచ్చి అరువు గాత్రంపై ఆధారపడని అతను వచ్చిరాని తెలుగునే మాట్లాడి విలనీకీ సరికొత్తదనాన్ని అపాదించాడు. అతనే జనవరి 12న ముంబైలో 72వ ఏట మృతి చెందిన అమ్రీష్‌పురి.

అమ్రీష్‌పురి సినిమాల్లోకి కాలుమోపింది 40వ ఏట. అప్పటికే రంగస్థలంపై నటనలో కల అనుభవం వాడనిపించుకున్నాడు. దాంతో సినిమాల్లోకి ఆలస్యంగా వచ్చినా నటనలో పకడ్బందీగా శిక్షణ పొందిఉన్నాడు. ఆయన తొలిసారిగా విలన్‌గా పి.సి.షినాయ్ తీసిన "సీసే కీ హాథ్'లో నటించాడు. ఆ తరువాత బావు "హమ్‌పాంచ్"లో ఆధునిక దుర్యోధనుని పాత్రకు బాగా పేరు తెచ్చుకున్నాడు. నాగిన్, ఫూల్ ఔర్ కాంటే, దివ్యశక్తి, చైనాగేట్, అంధాకానూన్, కోయిలా, కాలాపానీ, త్రిదేవ్, కరణ్ అర్జున్, దిల్‌జల్, విధాత, హీరో, దిల్‌వాలే దుల్హనియా లే జాయేంగే, గర్దిష్ గదర్, దోస్తానా, నాగిని, బాద్‌షా, నాయక్ వంటి వందకుపైగా హిందీ చిత్రాల్లో విలన్‌గా విలక్షణమైన నటనను ప్రదర్శించాడు. కాగా అమ్రీష్‌పురి విలనీ విశ్వరూపాన్ని చూపిన చిత్రం "మిస్టర్ ఇండియా". "మొగాంబో ఖుష్‌హువా" అనే డైలాగ్‌తో టాప్ విలన్‌స్టార్‌గా ఎదిగాడు.

విలన్‌గానే గాక చాలా చిత్రాల్లో సాఫ్ట్ కారెక్టర్స్ పోషించి మెప్పించడం అమ్రీష్‌పురి ప్రత్యేకత.



'గర్దిష్' లో ఒక ఉద్విగ్నమనస్కుడైన కానిస్టేబుల్‌గా నటించాడు. 'ఎలాన్'లోని ఆయన పాత్ర కన్నీరు పెట్టిస్తుంది. 'ముస్కురాహట్' లోని అమ్రిష్‌పురిని మంచిమనిషిగా ప్రేక్షకులు అంగీకరించలేదు. కానీ 'పర్దేశ్, విరాసత్, ముఝె కుచ్ కహ్‌నాహై వంటి చిత్రాల్లో సాత్వికమైన పాత్రలు ఆయనకు విలన్‌పాత్రలతో సమానమైన కీర్తినార్జించిపెట్టాయి.

బాలీవుడ్‌లోనే గాక హాలీవుడ్‌లో "గాంధీ" చిత్రంలో, స్పీల్‌బర్గ్ "ఇండియానా జోన్స్ ది టెంపుల్ ఆఫ్ డూమ్స్" లో విలన్‌గా నటించారాయన. స్పీల్‌బర్గ్ ఈ పాత్రకోసం 150 మందిని పరీక్షించిన పిదప అమ్రీష్‌పురిని ఎంపికచేయడం విశేషం.

తెలుగు చిత్రసీమలోకి "ఆఖరిపోరాటం"లో కాలుమోపి 'మేజర్ చంద్రకాంత్', 'కొండవీటిదొంగ', 'ఆదిత్య 369' 'అశ్వమేధం' 'జగదేకవీరుడు-అతిలోకసుందరి', 'నిప్పురవ్వ' చిత్రాల్లో స్వంత గొంతుకతో నటించి మెప్పించడం గొప్పసంగతి. ఇన్ని భాషల్లో నటునిగా సక్సెస్‌కావడానికి అమ్రీష్‌పురికి రంగస్థల నటనానుభవం ఉండటం కారణమైంది. ఆయన నటించిన "ముఝ్‌సె షాదీ కరోగి", "అబ్ తుమ్హారే హవాలే వతన్ సాథియో" ఇటీవలే విడుదల కాగా 'ఘూయ్ 'కిస్నా' త్వరలో విడుదల కానుంది. 220 చిత్రాల్లో నటించిన అమ్రీష్‌పురిని ఆలిండియా ఫిలింగోయర్స్ 'అభినయరాణా' బిరుదుతో గత ఏడాదే సన్మానించారు. అజిత్, అంజాద్‌ల మరణం, ప్రాణ్, ప్రేమ్‌చోప్రా రిటైర్‌మెంటల్‌ల తరువాత బాలీవుడ్‌లో హీరోలకు ధీటుగా నిలవగలిగిన స్టార్‌విలన్‌గా ఎదిగిన అమ్రీష్‌పురి విలక్షణ నటుడు.

✤

సునామీ - మాదరికి రాకుసుమీ

రెండువేల నాలుగు
పోతా పోతా పొంగిపోయేను -
సంద్రాలతో ముంచెత్తేను
కొంపా గూడూ - కొట్టుకుపోయె
తల్లి-పిల్లా - తేలిపోయె
లక్షకు పైగా - కాటికిపోయె
ఎప్పుడు ఎరుగని - 'సునామి" వచ్చి
సంతోషాన్ని - ఎత్తుకుపోయె. సునామీ
కొత్త భూతం

భూమిని కుదిపి బాధను మిగిల్చె
పోయిన వారికి అశృ తర్పణం
మిగిలిన వారికి -
ధైర్యమందించడం
అదే... అదే మన కర్తవ్యం
అందరి తరపున - మాదరికి
రానీయరాదని
ఈశ్వర్ అల్లా ఏ "సునామీ"

-మంథా శ్రీనివాస్

మృత్యు కడలి

కడలి కెరటాల ధాటికి
తీరాలన్నీ మృత్యు గీతాలు ఆలపించాయి,
క్షణాల్లో ప్రశాంతసాగరం
ప్రళయ తాండవంతో
ఎగిసిపడిన అలలు
ఏకంగా ఊర్లనే కౌగిలించుకున్నాయి శ్వాస
ఆడనంత గట్టిగా...!

ఎంత ప్రాణదాహం దానికి...?!
లక్షలపై చిలుకు ప్రాణాలు
కొట్టుకుపోయాయి కడలి గర్భంలోకి
అవును, అవి నిజంగా...
కడలి కెరటాలపై కన్పించని మరణ
శాసనాలే...!

- టి. కృష్ణాచారి

ADVOCATE న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

బయానా కాగితం చెల్లదని నోటీస్ ఇవ్వండి

మా నాన్న ఐదుగురు అన్నదమ్ముల్లో రెండవవారు.

ఈ మధ్యనే గొడవజరిగి వారసత్వంగా వచ్చిన ఇంటికి సంబంధించి పెద్దమనుషుల ఒప్పందం జరిగింది. దాని ప్రకారం ఖాళీ కాగితంపై రూపాయిస్టాంపు అంటించి మా తండ్రికి వారసత్వంగా వచ్చిన ఇంటిని మా చిన్న నాన్నకు అక్షరాల 80,000 వేల రూపాయలకు అమ్మినాము. అప్పుడు గొడవజరిగిందని తీసుకొని, ఇప్పుడేమో ఆ ఇల్లు నాకు వద్దు బయానాగా ఇచ్చిన రూ.10,000 మీరే ఉంచుకోండి కాని నాకు ఇల్లు వద్దు అంటున్నాడు.

మా నాన్నగారి అన్నదమ్ములతోనే మాకు పడక ఇళ్ళు తీసుకొని తీరా ఇప్పుడు ప్లేటు పిరాయిస్తున్నాడు. మా చిన్న నాన్న దగ్గర బాగా డబ్బుంది. వడ్డీవ్యాపారి గ్రామంలో పలుకుబడి వుంది. ఆయన పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఇడిఎంసి/డిఎ గా పనిచేస్తూ నెలకు 2500 రూపాయల జీతం తీసుకుంటున్నాడు. ఖాళీ కాగితంపై 1రూపాయి స్టాంపు అంటించి వ్రాసి ఇచ్చిన కాగితం కూడా ఆయన దగ్గరే వుంది. సాక్షులు కూడా మాకు వస్తారో లేదో?! మాకు మంచి సలహా ఇవ్వగలరని ప్రార్థిస్తున్నాను.

ఫసియుద్దీన్.
నిర్మల్, ఆదిలాబాద్‌జిల్లా.

మీ నాన్నగారు మీ చిన్నాయనకు అమ్మిన కాగితంలో 10,000 రూపాయల బయానా తీసుకున్నప్పుడు వ్రాసిన కాగితంలో (సమయం) గడువు విధించారా. ఆ గడువులోగా తను వచ్చి మిగతా డబ్బులు కట్టినట్లయితే ఆ కాగితం చెల్లుబాటు కానట్లు వ్రాసి ఉన్నారా లేదా? తెలుపలేదు. దాంట్లో ఉన్న నిబంధనల ప్రకారం మీరొక లాయర్ నోటీస్ పంపించండి. ఆ బయానా కాగితం చెల్లదని చెప్పించండి. దాంతో వస్తే సరి. లేదంటే యింకెవరికైనా అమ్ముకోవచ్చును.

పర్మినెంటయ్యేదెలా?

మా నాన్న చిన్నప్పుడే చనిపోవడంవల్ల మా అమ్మ ఒక గవర్నమెంటు హాస్టల్‌లో వర్కర్‌గా పని చేస్తోంది. ఇంతవరకు మా అమ్మకు పర్మినెంట్ కాలేదు. ఆ హాస్టల్‌లో పనిచేయడం మొదలెట్టి 17 సంవత్సరాలు పూర్తయ్యింది. అయినా ఇంతవరకు పర్మినెంట్ కాకపోవడానికి గల కారణం ఏమిటి? పర్మినెంట్ కావడానికి ఎవర్ని సంప్రదించాలి? మాకు పూర్తి వివరాలు తెలియజేయవలసిందిగా ప్రజాశక్తి వారిని కోరుతున్నాము.

పిండిపోలు సతీష్,
చివ్వెంల, నల్గొండజిల్లా.

17 సంవత్సరాలుగా పని చేస్తున్నా పర్మినెంట్ కాలేదు అంటే మీరు త్వరగా పై అధికారుల్ని, సోషల్ వెల్‌ఫేర్ అధికారుల్ని, ఆ తర్వాత జిల్లా కలెక్టర్‌ని కలిసి దరఖాస్తు పెట్టుకోండి. వారి ద్వారా పని కాకపోతే అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌లో దావా వేయాల్సి ఉంటుంది. ఇచ్చిన దరఖాస్తుకు ముట్టినట్లుగా రశీదు తప్పకతీసుకొని జాగ్రత్తగా మీ వద్ద అట్టే పెట్టుకోండి.

మీరు ఎదుర్కొనే న్యాయపరమైన సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయవాదులు సలహాలు ఇస్తారు. ఈ సమస్యలతో సతమతమయ్యే పాఠకులు తమ ప్రశ్నలను ప్రజాశక్తికి పంపిస్తే వీలువెంబడి న్యాయవాదుల సమాధానాలు ప్రచురిస్తాము.

చిరునామా :
న్యాయసలహాలు
ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, స్ట్రీట్ నెం. 1,
అశోక్‌నగర్, హైదరాబాద్ - 20

మసాలా దాల్ కిచిడీ

కావలసిన వస్తువులు:

బియ్యం	:	రెండు కప్పులు
శనగపప్పు	:	అర కప్పు
పొట్టు పెసర పప్పు	:	అర కప్పు
ఉల్లిపాయ ముక్కలు	:	ఒక కప్పు
పచ్చిమిర్చి ముక్కలు	:	పావు కప్పు
అల్లం, వెల్లుల్లి పేస్టు	:	ఒక టీ స్పూన్
లవంగాలు	:	ఆరు
ఉప్పు	:	తగినంత
పసుపు	:	పావు టీ స్పూన్
కారం	:	అర టీ స్పూన్
గరం మసాలా	:	ఒక టీ స్పూన్
నీళ్ళు	:	ఆరు కప్పులు
మసాలా ఆకులు	:	నాలుగు
జీరా	:	ఒక టీ స్పూన్
నూనె లేక నెయ్యి	:	ఒక కప్పు

తయారుచేసే విధానం: బియ్యం, పెసరపప్పు, శనగపప్పు కలిపి రెండు గంటలు నానపెట్టాలి. కుక్కర్‌లో నెయ్యి వేడిచేసి జీరా, మసాలా ఆకులు, గరమ్ మసాలా, లవంగాలు, ఉల్లిపాయ ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు, పచ్చిమిర్చి ముక్కలు, పసుపు, కారం వేసి వేయించి బియ్యం, పప్పులను వేసి బాగా కలిపి వేయించి నీరు, ఉప్పు వేసి మూత పెట్టాలి. ఉడుకు పట్టగానే సన్న సెగ మీద ఉంచి నీరు తియ్యగానే ఆపేయాలి. ఇది పెరుగు, ఊరగాయతో ఒడ్డించాలి.

చిలగడ దుంపలతో చక్రాలు

కావలసిన వస్తువులు:

బియ్యం	:	ఒక కిలో
చిలగడ దుంపలు	:	ముప్పావు కిలో
వాము	:	50 గ్రాములు
గసాలు	:	50 గ్రాములు
నూనె	:	ఒక కిలో
నువ్వులు	:	50 గ్రాములు
వెన్న లేక డాల్డా	:	వంద గ్రాములు
మిరియాలు	:	రెండు స్పూన్లు
ఉప్పు	:	తగినంత
కారం	:	అర స్పూను
ఇంగువ	:	కొద్దిగా

తయారుచేసే విధానం: చిలగడ దుంపలు మెత్తగా ఉడికించుకోవాలి. పైన తొక్క తీసి మెత్తగా చేయాలి. మిరియాలు పొడి కొట్టుకోవాలి. బియ్యం పిండిలో నువ్వులు, గసగసాలు, మిరియాల పొడి, ఇంగువ నీరు, కారం, ఉప్పు, వెన్న లేక డాల్డా, చిలగడ దుంపల పిండి వేసి చక్రాల పిండిలాగా కలుపుకోవాలి. స్టౌ మీద బాండీ పెట్టి నూనె పోసి కాగనివ్వాలి. నూనె కాగిన తరువాత చక్రాల గిద్దలలో పిండి పెట్టి చక్రాలు వత్తుకోవాలి. దోరగా వేగనిచ్చి తీసివేయాలి. ఇవి పది రోజుల వరకు నిల్వ ఉంటాయి.

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్
- కొత్త కోర్సుల వివరాలు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి.న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'మాథ్స్ స్కిల్స్'
- పోటీ పరీక్షల మెటీరియల్, మోడల్ పేపర్స్
- కెరీర్ గైడెన్స్
- ప్రతివారం ఓ ప్రత్యేక సమాచారం
- 'వ్యక్తిత్వవికాసం'

దీపిక

చందాదారులుగా చేరండి
సమాచారం
మీ ముంగిట నిలుస్తుంది

ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే
ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక

అమూల్యమైన సమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ.150లు, పోస్టు ద్వారా రూ.160లు
అర్థసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రు.80లు, పోస్టుద్వారా రూ.85లు
మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ./డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్. ఫోన్: 276645420, 27663761
మేనేజర్: 27673787, ఫ్యాక్స్: 2763921.
Website: www.prajasakti.com, e-mail: prajasakti@hotmail.com